

చేతిలోకి డీసీసీబీ, డీసీఎంఎస్?

- చైర్మన్ పదవులను దక్కించుకోనున్న కాంగ్రెస్
- రేపు కూరాకులపై అవిశ్వాసం
- డైరెక్టర్ పదవి నుంచి రాయల తొలగింపు

ఖమ్మం, జనవరి 25 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): అసెంబ్లీ ఎన్నికలతో రాష్ట్ర రాజకీయాల్లో వచ్చిన మార్పులతో జిల్లా రాజకీయాల్లోనూ సమీకరణలు మారుతున్నాయి. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. కీలకమైన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, జిల్లా మార్కెటింగ్ సొసైటీ అధ్యక్ష పదవులను చేతుల్లోకి తీసుకోబోతోంది. ఈ రెండు పదవులు ప్రస్తుతం బీఆర్ఎస్ ఖాతాలో ఉండడంతో వాటిని తమ పరం చేసుకునేందుకు కాంగ్రెస్ పావులు కదుపుతోంది. ఈ నేపథ్యంలో అవిశ్వాసాలకు తెరలేచింది. ఈ పరిణామాల్లో తొలుత బీఆర్ఎస్‌కు చెందిన జిల్లా కేంద్ర సహకారబ్యాంకు చైర్మన్ కూరాకుల నాగభూషయ్య పదవికి గండం ఎదురుకానుంది. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న వీవెంకటాయపాలెం సొసైటీలోని 11మంది సొసైటీ డైరెక్టర్లు కూరాకుల నాగభూషయ్యపై తిరుగబాటు చేసి.. అవిశ్వాసం పెట్టాలని కోరుతూ జిల్లా సహకార అధికారి (డీసీవో) విజయకుమారికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో 27వతేదీ శనివారం వీవెంకటాయపాలెం సొసైటీ కార్యాయలంలో జరిగే అవిశ్వాస తీర్మాన సమావేశానికి హాజరుకావాలని డీసీవో డైరెక్టర్లందరకి నోటీసులు జారీచేశారు. దీంతో 27న ఉదయం 11గంటలకు తెలంగాణ సహకారచట్టం 1964ను అనుసరించి అవిశ్వాసంపై ఓటింగ్ జరపనుండగా.. ఇప్పటికే 13మంది డైరెక్టర్లలో 11మంది నాగభూషయ్యకు వ్యతిరేకంగా సంతకాలు చేసి క్యాంపునకు వెళ్లిపోయారు. ఈ క్రమంలో నాగభూషయ్యపై వారు అవిశ్వాస తీర్మానాన్ని నెగ్గడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ పరిస్థితిని గ్రహించిన నాగభూషయ్య అవిశ్వాసాన్ని ఎదుర్కొనేందుకు న్యాయపరంగా ప్రయత్నాలు చేసినా అవి ఫలించలేదు. దాంతో నాగభూషయ్య అవిశ్వాస తీర్మాన సమావేశానికి ముందుగానే అంటే శుక్రవారమే స్వచ్ఛందంగా తన సొసైటీ చైర్మన్ పదవికి రాజీనామా చేయబోతున్నారంటూ ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే ఆయన డీసీసీబీ డైరెక్టర్, చైర్మన్ పదవులను కోల్పోయి.. సొసైటీ డైరెక్టర్‌గా మాత్రమే కొనసాగుతారు. ఇక సొసైటీ చైర్మన్‌కు ఆయన రాజీనామా చేసినా, విశ్వాసం కోల్పోయినా వి వెంకటాయపాలెం సొసైటీ ఉపాధ్యక్షుడిగా ఉన్న రావెళ్ల శ్రీనివాసరావుకు తాత్కాలింగా సొసైటీ అధ్యక్ష బాధత్యలు దక్కే అవకాశం ఉంది. ఇక డీసీసీబీ చైర్మన్‌పదవి ఖాళీ అయితే ప్రస్తుతం వైస్‌చైర్మన్‌గా ఉన్న దొండపాటి వెంకటేశ్వరరావుకు తాత్కాలిక బాధ్యతలు దక్కే అవకాశం ఉంది. ఆ తర్వాత మళ్లీ ఎన్నికల నోటిఫికేషన్ జారీచేసి అధికారికంగా చైర్మన్ల ఎన్నికలు నిర్వహిస్తారు.



డీసీఎంఎస్ చైర్మన్‌పై చర్యలు

డైరెక్టర్ పదవి నుంచి తప్పిస్తూ డీసీవో ఆదేశాలు



ఖమ్మం డీసీఎంఎస్ చైర్మన్, బీఆర్ఎస్‌కు చెందిన రాయల వెంకట శేషగిరిరావును తాను ప్రాతినిధ్యం వహిస్తున్న తల్లాడ మండలం గంగదేవిపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ డైరెక్టర్‌గా అనర్హత వేటు వేస్తూ డీసీవో విజయకుమారి ఆదేశాలు జారీచేశారు. దీంతో ఆయన సొసైటీ అధ్యక్ష పదవితో పాటు డీసీఎంఎస్ చైర్మన్ పదవిని కూడా కోల్పోబోతున్నారు. డీసీఎంఎస్ చైర్మన్‌గా ఉన్న రాయల వెంకటశేషగిరిరావు ఖమ్మంజిల్లా కేంద్ర సహకారబ్యాంకు నుంచి 2018అక్టోబరు 24న రూ.27లక్షలు కారు రుణం తీసుకున్నారు. నెలవారీ వాయిదాల ప్రకారం బకాయిలు చెల్లించాల్సి ఉండగా.. 2020 ఏప్రిల్ 24వరకు సక్రమంగానే చెల్లించినా ఆతర్వాత గడువు ప్రకారం చెల్లించలేదు. 2023జనవరి24కు రుణవాయిదాల చెల్లింపు గడువు పూర్తవడంతో సహకారబ్యాంకు 1964 చట్ట నిబంధనల ప్రకారం అధికారులు రాయల శేషగిరిరావుకు డిఫాల్టర్ నోటీసులు జారీచేశారు. దీనిపై రాయల వివరణ ఇస్తూ గడువు తీరిన తర్వాత జనవరి18న మొత్తం బకాయి రూ.23,22,100 చెల్లించానని, కొవిడ్ పరిస్థితుల సమయంలో సకాలంలో ఈఎంఐలు చెల్లించలేదని తెలిపారు. కానీ సహకార సంఘాల చట్ట ప్రకారం డిఫాల్టర్‌గా గుర్తింపు పొందినందున, గడువులోపు బకాయిలు చెల్లించనందున గంగదేవిపాడు సొసైటీ డైరెక్టర్ పదవినుంచి అనర్హత వేటు వేస్తూ జిల్లా సహకారశాఖ అధికారి విజయకుమారి ఆదేశాలు జారీచేశారు. ఇక శేషగిరిరావు గంగదేవిపాడు సొసైటీ డైరెక్టర్‌గా అనర్హుడు కావడంతో ఆ సొసైటీ చైర్మన్, డీసీఎంఎస్ డైరెక్టర్, చైర్మన్‌గా పదవులు కూడా కోల్పోబోతున్నారు. దీనికి సంబంధించి నేడో రేపో అధికారిక ఆదేశాలు విడుదల ఇస్తామని డీసీవో విజయకుమారి తెలిపారు. రాయల శేషగిరరావు డీసీఎంఎస్ చైర్మన్‌పదవి కోల్పోతే ప్రస్తుత ఉపాధ్యక్షుడు, పాల్వంచ సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనిఆవాసరావుకు డీసీఎంఎస్ పగ్గాలు దక్కే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆయన కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. ఇక డీసీఎంఎస్ లావాదేవీలు, కార్యకలాపాలపై విచారణ జరపాలని కాంగ్రెస్ నాయకుడు నల్లమల వెంకటేశ్వరరావుతోపాటు పలువురు జిల్లా సహకార అధికారికి ఫిర్యాదు చేశారు.

ముందస్తు రాజీనామా యోచనలో కూరాకుల?

- రేపు వీవీ పాలెం సొసైటీ అధ్యక్షుడిపై అవిశ్వాస ఓటింగ్
- ఇప్పటికే శిబిరంలో ఉన్న వీవీ పాలెం సొసైటీ డైరెక్టర్లు

రఘునాథపాలెం, జనవరి 25: డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్యపై అవిశ్వాస తీర్మాన సమావేశం శనివారం జరగనుండగా.. ఆ సమావేశానికి ముందుగానే నాగభూషయ్య తన పదవికి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. డీసీసీబీ చైర్మన్‌గా ఉన్న కూరాకుల నాగభూషయ్యను పదవి నుంచి తప్పించేందుకు డీసీసీబీ డైరెక్టర్ల స్థాయి నుంచి కాకుండా ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న వీ.వెంకటాయపాలెం సొసైటీ నుంచే కాంగ్రెస్ పావులు కదిపింది. ఈ క్రమంలో నాగభూషయ్యకు వ్యతిరేకంగా సీపీఎం ఇతర పార్టీలు ముందుకు రాగా.. వీ.వెంకటాయపాలెం సొసైటీలోని మొత్తం 13 మంది సభ్యుల్లో 11మంది సభ్యులు ఈనెల 11న జిల్లా సహకార అధికారి విజయకుమారిని కలిసి అవిశ్వాస తీర్మానాన్ని కోరుతూ లేఖ అందించారు. వీ.వెంకటాయపాలెం సొసైటీ అధ్యక్షుడు అందుబాటులో ఉండటం లేదని, సమావేశాలు నిర్వహించటం లేదని అందులో పేర్కొన్నారు. దానికి స్పందించిన జిల్లా అధికారి ఈనెల 27 శనివారం అవిశ్వాస తీర్మానానికి ప్రత్యేక సమావేశం ఉంటుందని, ఆ సమావేశానికి హాజరై ఓటింగ్‌లో పాల్గొనాలంటూ మొత్తం 13మంది సభ్యులకు నోటీసులు పంపారు. ఈ నోటీసులు తీసుకున్న 13మంది డైరెక్టర్లలో ఇప్పటికే 11మంది కాంగ్రెస్ శిబిరంలో ఉన్నారు. చైర్మన్ కూరాకుల నాగభూషయ్యతోపాటు ఆయన బంధువు మరొకరు మాత్రమే బీఆర్ఎస్‌లో ఉన్నారు. 11మంది సభ్యులు ఏపీలోని అరకు ప్రాంతంలో ఉన్న కాంగ్రెస్ శిబిరంలో ఉండగా.. వారిని బుజ్జగించేందుకు కూరాకుల ప్రయత్నించారని, అవి ఫలించేలేదని, దీంతో ఆయనే స్వచ్ఛందంగా ముందస్తు రాజీనామా నిర్ణయం తీసుకోబోతున్నారని సమాచారం. మంగళవారం ఖమ్మంలో జరిగిన డీసీసీబీ డైరెక్టర్ల సమావేశంలోనూ ఈ విషయంపై ఆయన పలువురు డైరెక్టర్లతో చర్చించారని, మెజారిటీ సభ్యులు లేకపోవడం.. అవిశ్వాసం నెగ్గే పరిస్థితులు లేకపోవడంతో ఆయన రాజీనామా నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. తనకు పదవి రావటానికి సహకరించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను కలిసి విషయం చెప్పి శనివారం జరిగే అవిశ్వాస తీర్మాన సమావేశానికి ముందుగానే తన రాజీనామా నిర్ణయాన్ని వెల్లడించే అవకాశాలున్నట్టు చర్చ జరుగుతోంది.


అరకు టూర్‌లో ఉన్న సొసైటీ డైరెక్టర్లు


బుగ్గపాడులో కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎంపీ నాగేశ్వరరావు

పార్లమెంట్ ఎన్నికల్లో

మెజారిటీ వచ్చేలా కృషి చేయాలి

కార్యకర్తలకు ఎంపీ నామ నాగేశ్వరరావు పిలుపు

సత్తుపల్లి, జనవరి25: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపొందేలా కార్యకర్తలు కృషి చేయాలని పార్లమెంట్ సభ్యుడు నామా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం ఆయన సత్తుపల్లి మండలంలో పర్యటించి బుగ్గపాడులో గ్రామ ఉప సర్పంచ్ బొడ్డు శ్రీనివాసరావు, రుద్రాక్షపల్లి, తుంబూరు గ్రామాల బీఆర్ఎస్‌పార్టీ జోనల్ సభ్యులు దాసరి ప్రసాద్‌రెడ్డి, కొప్పుల అప్పారావు కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, సత్తుపల్లి మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, సత్తుపల్లి, దమ్మపేట జడ్పీటీసీ సభ్యులు కూసంపూడి రామారావు,పైడి వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావు, నాయకులు దొడ్డా శంకరరావు, శ్రీధర్‌రెడ్డి, శివబాబు, పవన్ ఉన్నారు.

ఎన్నెస్పీ భూములపై

నిఘా పెట్టండి

- ఆక్రమణలు తొలగించండి
- నీటిపారుదల శాఖ అధికారులతో సీఈ విద్యాసాగర్



ఖమ్మం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో నాగార్జున సాగర్ మిగులు భూముల విషయంలో నిఘా చర్యలు తీసుకోవాలని, ఆక్రమణలు తొలిగించాలని ఇరిగేషన్‌శాఖ అధికారులను నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ విద్యాసాగర్ ఆదేశించారు. గురువారం ఖమ్మంలోని తన కార్యాలయంలో అధికారులతో మాట్లాడిన సీఈ ఖమ్మం నియోజకవర్గంలో పలుచోట్ల ఎన్నెస్పీ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని, సాగర్ కాలువ మిగులు భూములు కూడా రైతుల పేర్లతో తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించుకుంటున్నారని వాటిని తొలిగించాలని సూచించారు. అలాగే ఆక్రమించిన వారికి నోటీసులు జారీచేయాలని, యుద్ధప్రాతిపదికన ఎన్నెస్పీ భూములను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇక ప్రభుత్వ అవసరాలకు తీసుకుని ఖాళీగా ఉంచిన ఎన్ఎస్పీ భూముల వివరాలు సేకరించాలని, వాటిని అన్యాక్రాంతం కాకుండా చూడాలని ప్రభుత్వ శాఖలు వినియోగించుకోని పక్షంలో తిరిగి నీటిపారుదలశాఖ పరిధిలోకి తీసుకోవాలని సూచించారు. గతంలో రైతులనుంచి నీటిపారుదల శాఖ డబ్బులు ఇచ్చి సేకరించిందని, ఈ భూములపై పూర్తిగా నీటిపారుదలశాఖకే అధికారం ఉంటుందని సీఈ సూచించారు.

ప్రలోభాలకు లొంగకుండా ఓటేయాలి

జాతీయ ఓటర్ల దినోత్సవంలో కలెక్టర్ గౌతమ్


యువ ఓటర్లకు ఎపిక్ కార్డులు అందిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 25: ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం లాంటి ఓటు హక్కును ప్రలోభాలకు లొంగకుండా వినియోగించుకోవాలని కలెక్టర్ వీపీ గౌతమ్ పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన ఆయన భారత ఎన్నికల కమిషన్ సందేశాన్ని ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించారు. ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఓటు ప్రాముఖ్యాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా 2011నుంచి జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తోందని, 2024లో జరిగే లోక్‌సభ ఎన్నికలతో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య పండుగ జరగబోతోందన్నారు. కులం, మతం ప్రాంతం, వర్గం, భాష, పేదలు, ధనికులు అనే అంతరాలు లేకుండా అందరికీ సమానంగా కల్పిస్తున్న ఓటుపైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమంల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేసిన కలెక్టర్ సీనియర్ సిటిజన్లను ఘనంగా సత్కరించారు. అలాగే నూతనంగా ఓటు హక్కు పొందిన వారి ఎపిక్ కార్డులను అందించి.. ఓటుహక్కును సక్రమ మార్గంలో వినియోగించుకుని దేశ ఉజ్వల భవిష్యత్‌కు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, శిక్షణ కలెక్టర్ మయాంక్ సింగ్, స్వీప్ జిల్లా నోడల్ అధికారి కొండపల్లి శ్రీరాం, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సీహెచ్ స్వామి, కలెక్టరేట్ ఎన్నికల సూపరిన్‌టెండెంట్ రాంబాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేపు మధిరలో

డిప్యూటీ సీఎం పర్యటన



మధిర, జనవరి 25 : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శనివారం మధిర నియోజకవర్గంలోని మధిర, చింతకాని మండలాల్లో పర్యటించి పలు అధికారిక, అనధికారిక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈమేరకు ఆయన పర్యటన వివరాలను డిప్యూటీ సీఎంవో కార్యాలయం గురువారం వెల్లడించింది. శనివారం ఉదయం 6గంటలకు హైదరాబాద్ ప్రగతిభవన్‌నుంచి రోడ్డుమార్గంలో బయల్దేరనున్న ఆయన 10గంటలకు మధిర మండలం బయ్యారం చేరుకుంటారు. అక్కడ అధికారులు, అనధికారుల సమావేశంలో పాల్గొని నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తారు. ఆ తర్వాత 10.45గంటలకు చిలుకూరులో పాఠశాల భవనం, 11.15గంటలకు నిదానపురంలో హెల్త్‌సెంటర్, 11.45కు మాటూరులో హెల్త్‌సెంటర్‌ను ప్రారంభించి 12.45 గంటలకు చింతకాని మండలం నాగులవంచ చేరుకుంటారు. అక్కడ రైతు వేదికను ప్రారంభిస్తారు. ఇక మధ్యాహ్న విరామం అనంతరం 2.20 గంటలకు చిన్నమండవలో హెల్త్‌సెంటర్, మధ్యాహ్నం 3గంటలకు నాగులవంచలో పాఠశాలలో వాటర్‌ప్లాంట్, డైనింగ్‌హాలు, 3.30 గంటలకు కొదుమూరు గ్రామ పంచాయతీ భవనం, 4గంటలకు 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్నారు. సాయంత్రం 5గంటలకు రాఘవాపురంలోని కొల్లి సీతయ్య రెసిడెన్సీని సందర్శించి 6గంటలకు చింతకానిలో జరిగే కార్యక్రమంలో పాల్గొని.. రాత్రి 7.30గంటలకు హైదరాబాద్ తిరుగు పయనమవుతారు.

గణతంత్ర వేడుకకు

సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం
- పరిశీలించిన కలెక్టర్, సీపీ

ఖమ్మం కలెక్టరేట్ / ఖమ్మం క్రైం, జనవరి 25: గణతంత్ర వేడుకకు సర్వం సిద్ధమైంది. ఈ వేడుకల నిర్వహణకు గాను కలెక్టరేట్, పోలీస్ పేరేడ్‌గ్రౌండ్‌ను ముస్తాబు చేశారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బిసత్యప్రసాద్, పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్ వీపీ గౌతమ్ జాతీయ జెండాను ఆవిష్కరించనుండగా.. దీనికి సంబంధించిన ఏర్పాట్లను గురువారం అధికారులు పూర్తిచేశారు. పరేడ్ గ్రౌండ్‌లో జరిగే వేడుకల్లో కలెక్టర్ పోలీసుల గౌరవ వందస్వీకారాన్ని స్వీకరించగనుండగా.. పలుశాఖలకు సంబంధించిన స్టాళ్లు, శకటాల ప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు. అలాగే విధినిర్వహణలో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన ఉద్యోగులకు అవార్డులను అందజేయనున్నారు. ఇక వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వనున్నారు. ఇక కలెక్టర్ వీపీ గౌతమ్ గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై శాఖల వారీగా సమీక్షించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని ప్రస్ఫుటించేలా శకటాలు, స్టాళ్లను ఏర్పాటు చేయాలని, సాంస్కృతిక, తదితర కార్యక్రమాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి మధుసూదన్ నాయక్, డీఆర్డీవో విద్యాచందన, డీఈవో సోమశేఖరశర్మ, ఆర్డీవో మహ్మద్ గౌస్, సోషల్ వెల్ఫేర్ డీడీ సత్యనారాయణ, బీసీ వెల్ఫేర్ అధికారి జ్యోతి, మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ, రెవెన్యూ డివిజనల్ అధికారి గణేష్, ఫైర్ ఆఫీసర్ జయప్రకాష్, కలెక్టరేట్ ఏవో అరుణ, తదితరులు పాల్గొన్నారు.




ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్, కలెక్టర్ గౌతమ్

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, సీపీ

గణతంత్ర వేడుకల కోసం ఖమ్మం పోలీసుపరేడ్ మైదానంలో చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్ వీపీ గౌతమ్, పోలీసుకమిషనర్ సునీల్‌దత్ గురువారం పరిశీలించారు. అధికారులకుపలు సూచనలు చేసిన వారు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. భద్రత, బందోబస్తు, పోలీసుల కవాతు రిహార్సల్స్ లాంటి అంశాలపై చర్చించారు. వారి వెంట ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి, ఖమ్మం టౌన్ ఏసీపీ హరికృష్ణ, ఎస్బీ ఏసీపీ ప్రసన్నకుమార్, ఏఆర్ ఏసీపీలు నరసయ్య, సుశీల్‌సింగ్, అర్బన్ తహసీల్దార్ స్వామి, ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం తదితరులున్నారు.

బీఆర్ఎస్ నగర అధ్యక్షుడి అరెస్ట్

- 'అక్రమ'బద్ధీకరణ వ్యవహారంలో పగడాల నాగరాజుపై అధికారుల చర్యలు
- తప్పుడు పత్రాలతో 415 గజాల స్థలాన్ని క్రమబద్ధీకరించుకోవడంపై గతంలోనే కేసు
- 59జీవో పేరిట చేసిన అక్రమాలను బయటపెట్టిన 'ఆంధ్రజ్యోతి'

ఖమ్మం, జనవరి25 (ఆంధ్రజ్యోతి): జీవో నెం.59ను అడ్డుపెట్టుకుని ఖమ్మం నగరం నడిబొడ్డున ఉన్న 415 గజాల రూ.కోట్ల విలువ చేసే స్థలాన్ని అక్రమంగా క్రమబద్ధీకరించుకున్న కేసులో ఖమ్మానికి చెందిన మహిళా కార్పొరేటర్ భర్త, బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజును గురువారం రాత్రి ఖమ్మం టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఖమ్మం నగరంలోని బుర్హాన్‌పురంలో బైపాస్‌రోడ్డుకు ఆనుకుని ఉన్న ఎలాంటి నిర్మాణం లేని 415 గజాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు ఓ మహిళా కార్పొరేటర్ పేరుతో క్రమబద్ధీకరణ చేశారు. సదరు స్థలాన్ని అక్రమంగా క్రమబద్ధీకరించుకున్న విషయం వెలుగులోకి రావడంతో మున్సిపల్, రెవెన్యూ అధికారులు జరిపిన విచారణ నిర్వహించారు. సదరు విచారణలో క్రమబద్ధీకరణ చేయించుకున్న ఇంటినెంబరు 92 సర్వే నెంబరులో ఉన్నట్టు చూపించగా అది 93 సర్వే నెంబరులో ఉందని, ఆ ఇంటి నెంబరు ఉన్న ఇంటిని పదేళ్ల క్రితమే కూల్చి వేసినట్టు తేల్చారు. దాంతో సంబంధిత క్రమబద్ధీకరణ డాక్యుమెంటను రద్దు చేయడంతోపాటు, 59 జీవో ప్రకారం స్థలాల క్రమబద్ధీకరణకు చేసుకున్న దరఖాస్తుల విచారణ అధికారిగా ఉన్న జిల్లా ఉపాధి అధికారి కె.శ్రీరామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఖమ్మం టూటౌన్ పోలీసులు కార్పొరేటర్ పగడాల శ్రీవిద్యపై 420, 467,468, 471 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. సదరు కేసుకు సంబంధించి బీఆర్ఎస్ నగర అధ్యక్షుడిగా ఉన్న పగడాల శ్రీవిద్య భర్త పగడాల నాగరాజును గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు విచారణలో భాగంగా ఏసీపీ కార్యాలయానికి ఆయన్ను పిలిపించగా.. తన న్యాయవాదులతో కలిసి అక్కడకు వెళ్లిన అనంతరం అరెస్ట్ చేసి ఖమ్మం టూటౌన్‌కు తరలించారు. సదరు స్థలాన్ని అక్రమంగా క్రమబద్ధీకరించుకున్న వ్యవహారంలో పగడాల నాగరాజును ఏ2గా నమోదు చేసిన పోలీసులు, గురువారం అర్ధరాత్రి సమయంలో ఖమ్మం మొదటి అదనపు శ్రేణి కోర్టు న్యాయమూర్తి కాసరగడ్డ దీప ఎదుట హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. అయితే ఈ కేసుకు సంబంధించి నాగరాజు సతీమణి పగడాల శ్రీవిద్యకు ఈ నెల 17న ముందస్తు బెయిల్ మంజూరైనట్టు తెలిసింది. పగడాల నాగరాజును ఏసీపీ కార్యాలయానికి తరలించే సమయంలో, అరెస్ట్ చేసి టూటౌన్‌కు తరలించినప్పుడు అక్కడకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. సీఐలు కుమారస్వామి, స్వామి, శ్రీహరి ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా జీవో నెం 59 పేరుతో అక్రమాలు జరిగాయన్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. డాక్యుమెంట్లు రద్దు చేసిన ఉత్తర్వుల్లోనూ 'ఆంధ్రజ్యోతి' కథనం ఆధారంగా ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశాలకు అనుగుణంగా వాటిని రద్దు చేసినట్టు పేర్కొన్నారు.


నాగరాజును కోర్టుకు తరలిస్తున్న ఖమ్మం టుటౌన్ పోలీసులు

దీప్‌దాస్‌మున్షీని కలిసిన

మంత్రి తుమ్మల



ఖమ్మం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీప్‌దాస్‌మున్షీని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా నియమితులైన తర్వాత మున్షీని కలిసిన తుమ్మల లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఈ సందర్భంగా తన కుమారుడు యుగంధర్‌ను మున్షీకి పరిచయం చేశారు.

నాడు డీజీపీ.. నేడు టీఎస్‌పీఎస్సీ చైర్మన్

మహేందర్‌రెడ్డి నియామకంతో కిష్టాపురానికి రాష్ట్రస్థాయి ఖ్యాతి



కూసుమంచి, జనవరి 25: నాడు డీజీపీగా పోలీసు శాఖలో ఎన్నో సంస్కరణలకు నాంది పలికిన ముదిరెడ్డి మహేందర్‌రెడి.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా ఉన్నత పదవిని చేపట్టబోతున్నారు. దీంతో కూసుమంచి మండలం కిష్టాపురం గ్రామారిని మరోసారి రాష్ట్రస్థాయి ఖ్యాతి దక్కింది. మాజీ డీజీపీ ముదిరెడ్డి మహేందర్‌రెడ్డిని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా నియమిస్తూ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆమోదం తెలపగా.. రాష్ట్ర ప్రభుత్వం ఆ మేరకు నియామక ఉత్వర్వులు ఇచ్చింది.

మహేందర్‌రెడ్డి గురించి..

కిష్టాపురం గ్రామానికి చెందిన ముదిరెడ్డి నారాయణ రెడ్డి, అచ్చమ్మ దంపతులకు1962 డిసెంబరు 3న జన్మించిన మహేందర్‌రెడ్డి సర్వేల్ గురుకుల పాఠశాల, కూసుమంచి ఉన్నత పాఠశాలలో చదివారు. వరంగల్ ఎన్ఐటీలో ఇంజనీరింగ్ పూర్తిచేసి డిల్లీ ఎన్ఐటీలో చదువుతుండగా 1986లో ఐపీఎస్‌కు ఎంపికై వివిధ ప్రాంతాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వంలో 2017 నుంచి 2022 వరకు తెలంగాణ పోలీస్ బాస్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం విశ్రాంత డీజీపీగా ఉన్న మహేందర్‌రెడ్డిని కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం టీఎస్పీఎస్సీ చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లా ప్రజలు ముఖ్యంగా కిష్టాపురం వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శాఖలో సంస్కరణలు..

స్వగ్రామంలో అభివృద్ధి పనులు

1986 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అయిన మహేందర్‌రెడ్డి తొలిపోస్టింగ్ కరీంనగర్ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా తొలిపోస్టింగ్ పొందారు. ఆ తర్వాత గుంటూరు, బెల్లంపల్లిలో పనిచేసి, కర్నూరు ఎస్పీగా పనిచేశారు. తర్వాత తూర్పుజోన్ డీసీపీగా, పోలీస్ అకాడమీలో ఫ్యాకల్టీగా, ఇంటిలిజెన్స్ చీఫ్, గ్రే హౌండ్ ఐజీగా పలు హోదాల్లో పనిచేశారు. హైదరాబాద్ నగర పోలీస్ కమీషనర్‌గా అనంతరం డీజీపీగా నియమితులై 2022లో పదవీ విరమణ చేశారు. ఆయన డీజీపీగా పనిచేసిన సమయంలో పోలీస్ శాఖలో పలు సంస్కరణలు చేశారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థను తీసుకొచ్చి.. సమస్యలపై పోలీస్‌స్టేషన్లకు వచ్చే సామాన్యులకు కూడా గౌరవం ఇవ్వాలని, సార్ అంటూ పిలవాలంటూ సూచించారు. పోలీసును ఆశ్రయించిన వారెవరైనా.. పోలీస్‌శాఖ పని విధానం ఒకేలా ఉండాలంటూ ఆదేశించారు. ఎన్ని ఉన్నత పదవులు అధిరోహించినా మహేందర్‌రెడ్డి మాత్రం స్వగ్రామాన్ని మరువలేదు. గ్రామ అభివృద్ధి కోసం తన పరిధిలో ఉన్న అవకాశాలను ఉపయోగించి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో సీసీ రోడ్లు, డ్రైయినేజీలు మంజూరు చేయించడంతో పాటు పాఠశాలకు మరమ్మతులు చేయించారు. నర్సింహులగూడెం నుంచి కిష్టాపురం గ్రామానికి బీటీ రహదారితో పాటు పలు సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపించారు.

ఖమ్మం మార్కెట్ కార్యదర్శిగా ప్రవీణ్‌రెడ్డి



ఖమ్మం మార్కెట్ , జనవరి 25: ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా పాదూరి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి నియమితులైనారు. ఈమేరకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని పఠాన్‌చెరు మార్కెట్ కార్యదర్శి గా ఉన్న ప్రవీణ్‌రెడ్డిని ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు ఒక సంవత్సర కాలపరిమితితో కూడిన 'అదర్ డ్యూటీ' పై కార్యదర్శిగా తక్షణమే బాధ్యతలు స్వీకరించారని ఆర్డర్‌ను జారీ చేసింది. ప్రభుత్వం గత నెల క్రితం మార్కెట్ సెక్రెటరీగా ఉన్న రుద్రాక్షల మల్లేశాన్ని హుజూర్‌నగర్ మార్కెట్‌కు బదిలీ చేసిన సంగతి విదితమే. ఖమ్మం మార్కెట్‌కు నూతన సెక్రెటరీగా వస్తున్న ప్రవీణ్‌రెడ్డి గతంలో సైతం ఖమ్మం మార్కెట్ కార్యదర్శిగా ఒక సంవత్సర కాలం పాటు బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఉంది. ఈ సందర్భంగా ఖమ్మం మార్కెట్‌కు వస్తున్న ఆయనను జిల్లా మార్కెటింగ్ శాఖ ఉద్యోగుల సంఘం తాడేపల్లి కిరణ్‌కుమార్, నరేష్ పలువురు ఉద్యోగులు అభినందించా రు.

వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు శుక్ర, శని, ఆదివారాలు మూడు రోజులు సెలవులు ఉన్నట్లు మార్కెట్ ఇన్‌చార్జ్ సెక్రెటరీ బజారు ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం రిపబ్లిక్ ,దినోత్సవం, శని, ఆదివారాలు వారాంతపు సెలవులుగా ఉన్నట్లు ఆయన తెలిపారు. మార్కెట్‌లో సోమవారం నుంచి క్రయవిక్రయాలు ఉంటాయని ఆయన తెలిపారు. రైతులు విషయాన్ని గ్రహించాలని కోరారు.

అభ్యసనం లేని సిద్ధాంతం అంధత్వమే

- మార్క్సిజం అజేయం
- లెనినిజం సమకాలీన ప్రపంచం సెమినార్‌లో

ప్రొఫెసర్ యుగల్ రాయలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ యుగల్ రాయలు

ఖమ్మం సంక్షేమవిభాగం, జనవరి 25: కార్మిక, కర్షకులను శ్రమదోపిడి నుంచి విముక్తి చేసే మార్క్సి జం అజయేమని, అయితే అభ్యాసనం లేని ఎంత గొప్ప సిద్ధాంతాలైన అంధత్వానికి దారి తీస్తాయని, కమ్యూనిస్టు పార్టీలు నిరంతరం మార్క్సిజం సిద్ధాంతాలు అభ్యాసనం జరగాలని నాగపూర్ ధరమ్‌సేత్ యూనివర్సిటీ రిటైర్డ్ హెచ్‌వోడీ ప్రొపెసర్, డాక్టర్ యుగల్ రాయలు పిలుపునిచ్చారు. లెనిన్ శత వర్ధంతి సభల్లో బాగంగా గురువారం సీపీఐ జిల్లా సమితి కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన లెనినిజం సమకాలీన ప్రపంచం సెమినార్‌లో ఆయన ప్రధాన వక్తగా ప్రసగించారు. సోసలిజం ఎక్కడైతే ఖచ్చితంగా అమలు జరుగుతుందో అక్కడే రామరాజ్యం ఉన్నట్లుగా పేర్కొన్నారు. ఆకలి లేని ప్రజలు, శాంతి, ఉపాధి, వ్యవసాయం, విద్వేషాలు లేని సమాజం సోసలిజం కోరుకుంటుందన్నారు. చిరు వ్యాపారులపై కార్పొరేట్ కంపెనీల ప్రభావాన్ని లెనిన్ ఎప్పుడు రాశారని వివరించారు. ప్రతి సమస్యకు పరిష్కార మార్గం మార్క్సిజంలో ఉందన్నారు. లెనిన్ రాసిన అద్భుత గ్రంధాల్లో రాష్ట్రం విప్లవం ఏమీ చేయాలి, ఎలా చేయాలి, పెట్టుబడి దారి సమాజంలో అత్యున్నత దశ గ్రంథాలు ప్రజా ప్రచూర్యం పొందాయన్నా రు. తుపాకీలు లేకున్నా ప్రజల తోడు ఉంటే మార్క్సిజం సిద్ధాంతాలను కమ్యూనిస్టు పార్టీలు అమలు చేస్తాయన్నారు. సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలు బలంగా ఉన్న ప్రాంతాల్లో మార్క్సిజం సిద్ధాంతాలు అభ్యాసనం జరుగుతుం దన్నారు. జిల్లా సమితి కార్యదర్శి పోటు ప్రసాద్ మాట్లాడుతూ లెనిన్ జీవిత చరిత్రను వివరించారు. అధ్యాయన విభాగం బాధ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, ఏపూరి లతాదేవి, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేశ్, సబ్ కమిటీ కన్వీనర్ శింగు నర్సింహారావు, మేకల శ్రీనివాసరావు, పోటు కళావతి పాల్గొన్నారు.

ఉత్తమ అధికారులకు అవార్డులు

- ఉత్తమ డీఎంహెచ్‌వోగా డాక్టర్ శిరీష
- ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్

ఆదర్శ సురభికి ప్రశంసాపత్రం

చుంచుపల్లి, జనవరి 25: తెలంగాణ రాష్ట్రంలోని ఉత్తమ డీఎంహెచ్‌వోగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ జేవీఎల్ శిరీష గురువారం ఎంపికయ్యారు. ఈ అవార్డును హైదరాబాద్ బేగంపేటలోని ఎన్‌హెచ్‌ఎం రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీఎం డాక్టర్ త్రివేణి, వైద్యఆరోగ్యశాఖ కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జెడ్ చాంగ్తూ, కమిషనర్ ఆర్‌వి కర్ణన్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ బి.రవీందర్ నాయక్ పాల్గొన్నారు. అన్ని జాతీయ హెల్త్ ప్రోగ్రాంలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొదటిస్థానంలో నిలిచినందుకు బెస్ట్ డీఎంహెచ్‌వో అవార్డును డాక్టర్ శిరీషకు ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టియాన జెడ్ చాంగ్తూ అందజేశారు. ఈ అవార్డులు జిల్లాకు వచ్చినందుకు గాను భద్రాద్రి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ఉత్తమ ప్రతిభకు గుర్తింపు

ఖమ్మంకార్పొరేషన్: ఓటరు నమోదు అధికారి కేటగిరీలో ఉత్తమ ప్రతిభ కనపరిచినందుకు ఖమ్మం నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి గవర్నర్ తమిళిసై నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో గురువారం వేడుకలు నిర్వహించారు. అందులో భాగంగా ఓటరు నమోదులో ప్రతిభ చూపిన అధికారులకు ప్రశంసాపత్రాలు అందచేశారు. ఖమ్మం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి ఓటర్ల నమోదులో ప్రత్యేక దృష్టి పెట్టారు. అర్హులైన వారందరితో ఓటుకోసం నమోదు చేసుకోవాలని అవగాహన కల్పించారు. అంతేకాకుండా కాలేజీలు, పాఠశాలల గోడలపై ఓటు హక్కు ప్రాధాన్యత తెలిపేలా వాల్‌పెయింట్లు వేయించారు. కళాశాలల్లో అవగాహన తరగతులు నిర్వహించి, 18ఏళ్ల నిండిన వారందరికీ ఓటు హక్కు వచ్చేలా కృషి చేశారు. ఓటరు నమోదులో కమిషనర్ చేసిన కృషికి గురువారం గవర్నర్ తమిళసై ఆయనకు ప్రశంసాపత్రం అందజేశారు.





అవార్డును స్వీకరిస్తున్న కొత్తగూడెం డీఎంహెచ్‌వో శిరీష, గవర్నర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న కమిషనర్

పామాయిల్ తోటలను సందర్శించిన జగిత్యాల రైతులు

అశ్వారావుపేట, జనవరి 25: జగిత్యాలకు చెందిన సుమారు 150 మంది పామాయిల్ రైతులు గురువారం అశ్వారావుపేట, దమ్మపేటలో మండలాలలో పలు పామాయిల్ క్షేత్రాలను సందర్శించారు. పామాయిల్ రైతులు విజ్ఞాన విహార యాత్రలో బాగంగా పామాయిల్ నర్సరీల పెంపకం, క్షేత్రాలు, సాగు విధానం, నీటి యాజమాన్యం, ఎరువుల యాజమాన్యంపైన అవగాహనకోసం అశ్వారావుపేటలోని పామాయిల్ నర్సరీని సందర్శించారు. అనంతరం నారంవారిగూడెంలోని పామాయిల్ తోటలను రైతులు అశ్వారావుపేట ఆయిల్‌ఫెడ్ అధికారులు చూపించారు. అనంతరం దమ్మపేట మండలంలోని అప్పారావుపే ఫ్యాక్టరీని చూపించి, ఉత్పత్తి అయిన పామాయిల్ గెలల క్రషింగ్ విధానం, క్రూడాయిల్ ఏ విధంగ వస్తుందనే దానిపైన వివరించారు. రైతులకు ఆయిల్‌ఫెడ్ పీల్డ్ ఆఫీసర్లు అప్పారావు, మహేష్, సతీష్, అశోక్ తదితరులు తోటలు, నర్సరీలను చూపించి వాటిపై అవగాహన కల్పించారు.

ప్రభుత్వ స్థలానికి రక్షణ చర్యలు ●ఫెన్సింగ్ వేసిన రెవెన్యూ అధికారులు

ఖమ్మంకార్పొరేషన్, జనవరి 25: నగరంలోని 14వ డివిజన్ పరిధిలోని పాత రాజన్నపేటలో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన షెడ్లను రెవెన్యూ అధికారులు గురువారం తొలగించి, ప్రభుత్వస్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. పాత రాజన్నపేటలో గ్రామకంఠం భూమి ఉండగా, ప్రభుత్వం కొందరు రైతులకు సదరు భూమిని పంపిణీ చేసింది. గ్రామకంఠాన్ని ఆనుకొని సర్వేనెంబరు 308,309లో ప్రభుత్వభూమి ఉంది. అయితే ప్రభుత్వ భూమి 4 ఎకరాల్లో కొందరు షెడ్లు వేసి, జీవోనెంబర్ 59కింద క్రమబద్ధీకరించుకోవాలని ప్రయత్నించారు. దీనిని తిరస్కరించిన రెవెన్యూ అధికారులు గురువారం షెడ్లు తొలగించి, స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.



ఫెన్సింగ్ వేస్తున్న రెవెన్యూ సిబ్బంది

దుమ్మూ ధూళితో ఉండలేం

- బంకర్‌ను తరలించండి.. లేకుంటే పునరావాసం చూపించండి
- పలుమార్లు విన్నవించిన పట్టింపేలేని సింగరేణి యాజమాన్యం
- కిష్టారం సీహెచ్‌పీ వద్ద అంబేద్కర్ నగరవాసుల ఆందోళన
- లోడింగ్ పనులను అడ్డుకునేందుకు యత్నం



సీహెచ్‌పీ వద్ద ఆందోళన చేస్తున్న అంబేద్కర్ నగర్ వాసులు

సత్తుపల్లిరూరల్, జనవరి 25: కొన్నేళ్లుగా సింగరేణి కారణంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని, ఇక ఊరిలో ఉండలేమని, లేదంటే లోడింగ్ పాయింట్ అయినా వేరేచోటకు మార్చాలంటూ సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామస్తులు ఆందోళన చేశారు. ఆందోళన చేసే క్రమంలో లోడింగ్‌ను అడ్డుకునేం దుకు యత్నించగా సింగరేణి అధికారుల సమాచారం అందించడంతో సత్తుపల్లి డివిజన్ పోలీసులు గ్రామానికి చేరుకోగా ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. సింగరేణి అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వడంతో పోలీసుల విజ్ఞప్తి మేరకు గ్రామస్థులు ఆందోళనను విరమించారు.

సత్తుపల్లి జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీల పరిధిలోని బొగ్గును తరలించేందుకు రోడ్డు మార్గం అనువైనది కాకపోవడంతో మండలంలోని కిష్టారం అంబేద్కర్ నగర్ సమీపంలో కోల్ హ్యాడ్లింగ్ పాయింట్‌ను యాజమాన్యం ఏర్పాటు చేసింది. లోడింగ్ సమయంలో బొగ్గు దూళీ లేచి ఆవాసాలపై పడుతుందని, తాగునీరు కలుషితమవ్వడంతో పాటు ప్రజలంతా శ్వాసకోశ, ఇతర వ్యాధుల బారిన పడి నానా అవస్థలు ఎదుర్కొంటున్నారని వాపోయారు. అయితే సింగరేణి అధికారులు ఆయా సందర్భాలలో డస్ట్ లేవకుండా రక్షణ చర్యలు తీసుకుంటామని హామీలు ఇస్తున్నారే తప్పా ఆచరణలోకి రాకపోవడంతో చేసేదేమీ లేక గ్రామస్థులు ఆందోళనకు దిగారు.

మోహరించిన సత్తుపల్లి డివిజన్ పోలీసులు

కిష్టారం సీహెచ్‌పీ వద్ద లోడింగ్ పనులను అడ్డుకునేందుకు వచ్చిన గ్రామస్థులను అడ్డుకునేందుకు సత్తుపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామస్థులతో పోలీసులు చర్చలు జరపగా సత్తుపల్లి పట్టణ, రూరల్ సీఐలు మోహనబాబు, హనోక్‌లకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. తమకు స్పష్టమైన హామీ ఇవ్వాలని, లేకుంటే లోడింగ్ పాయింట్‌ను ఊరికి దూరంగా నిర్మించుకోవాలని, అలా కుదరలేదంటే తమకు పునరావాసమైనా కల్పించాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు. అయితే పోలీసుల సమక్షంలో కిష్టారం ఓసీ పీవో నరసింహారావు త్వరలోనే సీహెచ్‌పీ వద్ద బొగ్గు దూళీ గాలిలో లేవకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రక్షణ చర్యలు మూడు నెలల వ్యవధిలో తీసుకోనున్నట్లు హామీ ఇవ్వడంతో కిష్టారం అంబేద్కర్ నగర్‌వాసులు తాత్కాలికంగా ఆందోళనను విరమించారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

- గ్రామాలకు దూరంగా ఉండటంతో ఆసక్తి చూపని క్రీడాకారులు
- ఆర్భాటంగా ఏర్పాటు చేసి వదిలేశారని విమర్శలు





ఓ వెంచర్‌లోని పంచాయతీలకు సంబంధించి క్రీడా ప్రాంగణం, తనికెళ్ల సమీపంలోని క్రీడా ప్రాంగణం

కొణిజర్ల, జనవరి 25: గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారులను పోత్సహించేందుకు గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. వివిధ కారణాలతో అవి ఉపయోగంలోకి రాకపోవడంతో ఆయా గ్రామాల్లోని క్రీడా మైదానాలు నిరుపయోగంగా మారాయి. జిల్లా కేంద్రాలకే కాకుండ గ్రామాలలో కూడ యువత, విద్యార్థులకు క్రీడలను ప్రొత్సహించాలని గత ప్రభుత్వం లక్ష్యం మంచిదే అయినప్పటికి ఆచరణలో వాటిని వినియోగించకపోవడంతో నేమ్ బోర్డులతోనే అవి దర్శనమిస్తున్నాయి. పాఠశాలలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు తప్పా గ్రామలకు దూరంగా ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు ఏమాత్రం ఉపయోగంపడటం లేదు. స్థలాల సేకరణలో అధికారులు హడావుడి చేసి స్థలాలను సేకరించారు. సర్పంచ్‌లు కూడ స్థలాల సేకరణకు సహకరించారు. ఈజీఎస్ ద్వారా, కొన్ని పంచాయతీల నుంచి కొన్ని మెటీరియల్‌ను కొనుగోలు చేసి ఏర్పాటు చేశారు. వారు పని వందశాతం పూర్తి చేసి చూపించినప్పటికి వాటి వినియోగంపై ఎవరూ దృష్టి సారించలేదు.

నిరుపయోగంగా ప్రాంగణాలు..

కొణిజర్ల మండలంలో 27 గ్రామ పంచాయతీలకు 26 గ్రామ పంచాయతీలలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ఒక్క మల్లుపల్లి పంచాయతీల్లో మాత్రమే క్రీడాపాంగణాన్ని ఏర్పాటుచేయలేదు. ఇందులో కొణిజర్ల, సింగరాయపాలెం, పెద్దమునగా ల గ్రామాలలో ప్రభుత్వ స్థలాలు లేక నెలకు సుమారు రూ. ఒక వెయిచొప్పున లీజుకు తీసుకొని క్రీడా ప్రాంగణా లను ఏర్పాటు చేశారు. పెద్దమునగాల క్రీడా ప్రాంగణంను లీజుకు కాకుండ పాఠశాలలో ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించుకున్నారు. మిగిలిన పంచాయ తీలకు ప్రభుత్వ స్థలాల్లో, ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. తనికెళ్ల అమ్మపాలెం, రాజ్యాతండా, లింగగూడెం, ఉప్పచలక తదితర గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను కిలోమీటర్ దూరంగా ఉపయోగపడని విధంగా ఏర్పాటు చేశారు. అమ్మపాలెం, రాజ్యాతండా, లింగగూడెం పం చాయతీలకు చెందిన క్రీడా ప్రాంణాలను ఓ వెంచర్‌లో పంచాయతీకి ఇచ్చిన స్థలాల్లో ఏర్పాటు చేశారు. ఆ వెంచర్‌లోకి క్రీడాకారులు వెళ్లి ఆడిన దాఖలాలు లేవని ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని క్రీడా పాంగణాలు చెత్త పెరిగి, ముళ్ళకంపలు సైతం తయారవుతున్నాయి. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, లాంగ్‌జంప్ వంటి ఆటల కోసం ఈజీఎస్ ద్వారా సామగ్రిని కొనుగోలు చేశారు. క్రీడా ప్రాంగణాలలో సుమారు పది తప్పా ఎక్కడా కూడ ఉపయోగించుకోవడంలేదు. క్రీడా ప్రాంగణాలు గ్రామం బయట కంటే గ్రామాలలో ప్రజల మధ్య ఉంటే వినియోగంలోకి వస్తాయని అభిప్రాయం వ్యక్తం అవుతుంది. క్రీడా ప్రాంగణాల వినియోగం పట్ల అధికారులు దృష్టి పెట్టి వివిధ రకాలైన పోటీలను ఏర్పాటు చేసి క్రీడలపై ఆసక్తి చూపితే యువత క్రీడా ప్రాంణాలను సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంది.

సద్వినియోగం చేసుకునే విధంగా చూస్తాం

ఎంపీడీవో మహాలక్ష్మీ

క్రీడా ప్రాంగణాలపై ఎంపీడీవో స్పందించారు. అపరిశుభ్రంగా ఉన్న క్రీడా ప్రాంణాలను పరిశుభ్రంగా చేపించి క్రీడాకారులకు అందుబాటులోకి తెస్తాం. వెంచర్‌లలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలను కూడ ఆయా గ్రామాల క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవచ్చు. అక్కడ ఎవరూ కూడ అభ్యంతరాలు పెట్టరు. అలా చేస్తే తమకు సమాచారం ఇవ్వవచ్చు. గ్రామాలకు కొంచెం దూరంగా ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల అంటే ప్రభుత్వ స్థలం అక్కడ ఉందని ఏర్పాటు చేశాం. గ్రామీణ క్రీడాకారులు వాటిని కూడ వినియోగించుకోవాలి. పాఠశాలల్లో, గ్రామాలకు దగ్గరలో ఉన్న క్రీడా ప్రాంగణాలు ఉపయోగంలోనే ఉన్నాయి. వాటిని యువత క్రీడలకు ఉపయోగిస్తున్నారు. లీజులకు ఉన్న చోట వాటిని కూడ ప్రభుత్వ స్థలాల్లో వచ్చే విధంగా కృషి చేస్తున్నాం.

అనుమతి లేకుండా నిల్వలు ఉంచితే కఠిన చర్యలు

- ఖమ్మం జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల



గోదాం పరిశీలిస్తున్న డీఏవో

సత్తుపల్లి, జనవరి 25: జిల్లా వ్యాప్తంగా రైతులకు సరిపడా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని, అనుమతులు లేకుండా నిల్వలు ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారిణి ఎం.విజయనిర్మల హెచ్చరించారు. గురువారం సత్తుపల్లిలో ఆకస్మికంగా పర్యటించిన ఆమె మునిసిపాలిటీతో పాటు మండలంలోని సహకార సంఘాలు, ఎరువుల డీలర్లకు సంబందించిన దుకాణాలు, గోదాంలోని నిల్వలను తనిఖీ చేశారు. ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఎక్కడా ఎరువు ల సమస్యలు లేకుండా చూస్తున్నామని, నిల్వల విషయంలో లావాదేవీలు, స్టాక్‌లో లెక్కల ప్రకారం ఉన్నాయా లేదా అని పరిశీలించారు. దుకాణాల వద్ద ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే అక్కడికక్కడే పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఎరువుల క్రయవిక్రయాలలో రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని, పీవోఎస్ మెషిన్లలో నిల్వలు, గోదాంలో నిల్వలకు వ్యత్యాసం లేకుండా చూసుకోవాలని చెప్పారు. అనుమతి లేని, బిల్లులు, ఇన్‌వాయిస్‌లు లేకుండా నిల్వలు ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వై.శ్రీనివాసరావు, ఏఈవో టీ.నరేష్ ఉన్నారు.

'రాజీవ్ ట్రోఫీ' క్రికెట్ టోర్నీ షురూ



మాట్లాడుతున్న కొత్తా వెంకటేశ్వరరావు

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 25: రాజీవ్‌గాంధీ మెమోరియల్ రాజీవ్ ట్రోఫీ ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు గురువారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమైనాయి. పోటీలను డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొత్తా సీతారాములు, చిన్నపిల్లల వైద్యనిపుణుడు డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ యువత క్రీడలలో జీవితంలో ఒక భాగంలా ఎంపిక చేసుకోవాలని అన్నారు. క్రీడలతో గుర్తింపు లభించడమే కాకుండా ఉద్యోగ అవకాశాల దక్కుతాయన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. నగరంలో ఏడు రోజులు పాటు జరగనున్న ఈ పోటీలకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి 16 మండలాల టీములు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. విజేత లకు పెట్రోల్‌బంక్ బాబూరావు జ్ఞాపకార్థం బహుమతులు ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ స్టేడియం క్రికెట్ నెట్స్ ఇన్‌చార్జ్ మతిన్, పి. వరప్రసాద్, టీటీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఓలేటి సాంమూర్తి, వెంకటప్రసాద్, సూర్యం, వేణు, రంఘనాథ్ తదితరులు పాల్గొన్నారు.

దారిలేక రోగి అవస్థలు



అంజయ్యను వొర్రె దాటిస్తున్న యువకులు

ఆళ్లపల్లి, జనవరి 25: తాటిచెట్టుపై నుంచి పడి గాయాలై చికిత్స అనంతరం ఇంటి వెళ్లాల్సి అంజయ్యకు అవస్థలు తప్పడం లేదు. ఆళ్లపల్లి మండలం, మర్కోడు పంచాయతీలోని పాతూరు గ్రామానికి చెందిన మద్దెల అంజయ్య రెండు రోజుల క్రితం తాటిచెట్టు పైనుంచి కింద పడి, నడుముకు దెబ్బలు తగిలాయి. వైద్యం కోసం కొత్తగూడెం వెళ్లి చికిత్స అనంతరం తిరిగి గురువారం ఇంటికి వస్తున్న క్రమంలో దారి లేక అనేక ఇబ్బందులు పడ్డాడు. గ్రామానికి ఉన్న రెండు దారుల్లో ఒకపక్క జల్లేరు అడ్డు, మరో పక్క సెటుగారిచెరువు అలుగు వొర్రె అడ్డుగా ఉంది. జల్లేరు దారి కంటే, సెటుగారి అలుగు వొర్రె దగ్గర అయినపట్టికి ఆ మార్గంలో బురద, సరైన దారిలేక వాహనం, గ్రామంలోకి వేళ్లే పరిస్థితి లేదు. దాంతో నడవలేని అంజయ్యను యువకులు, చేతుల సహాయంతో ఇంటికి తీసుకవచ్చారు. కనీసం అత్యవసర పరిస్థితిల్లోనైన నడిచే రోడ్డు ఏర్పాటు చేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులను గ్రామస్థులు కోరుతున్నారు.

చేపల చెరువులకు కోసం గిరిజన సొసైటీలు ఏర్పాటు చేయాలి

●భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్

భద్రాచలం, జనవరి 25: ఏజెన్సీ ప్రాంతాల్లో చేపల చెరువులను అభివృద్ధి చేసేందుకు గిరిజనులతో సొసైటీలను ఏర్పాటు చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ అన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో గురువారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాద్, ములుగు జిల్లాల మత్స్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. పీవో మాట్లాడుతూ ప్రతీ ఏటా చేపల చెరువుల్లో చేపల ఉత్పత్తికి చేప పిల్లల విడుదల అభివృద్ధిపై ఎప్పటికప్పుడు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే పెసా గ్రామసభల ద్వారా చెరువులపై గిరిజనులకి హక్కులు కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, ఎఫ్‌డీవో అశోక్, నాలుగు జిల్లాల మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

దుమ్ముగూడెం జనవరి 25: లచ్చిగూడేనికి చెందిన సోందె రాముడు (31) బుధవారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ కలహాలు, వ్యవసాయం లాభసాటిగా లేకపోవడంతో మనస్థాపం చెందిన రాముడు అత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. ఈనెల 1న తన ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వైద్యచికిత్సలకోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. తన భర్త మృతిపట్ల ఎటువంటి అనుమానాలు లేవని భార్య సరోజిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేశవరావు కేసు నమోదు చేశారు.

మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రవర్తించిన వ్యక్తి అరెస్టు

●వివరాలు వెల్లడించిన ఎస్పీ రోహిత్‌రాజు



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

చుంచుపల్లి, జనవరి 25: మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు గురువారం తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో ఎస్పీ వివరాలను వెల్లడించారు. చుంచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాబుక్యాంపు ఏరియాలోని హిందూ దేవాలయాలకు, మసీదులకు, అక్కడ నివసించే సామాన్య ప్రజల చిరునామాలకు మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉత్తరాలు రాస్తున్న వ్యక్తిని బుధవారం సాయంత్రం చుంచుపల్లి పోలీసులు సీసీ టివి ఫుటేజ్ ఆధారంగా గుర్తించి అరెస్టు చేశారు. అశ్వాపురం హెవీ వాటర్ ప్లాంట్‌లో సీనియర్ క్లర్క్‌గా పని చేస్తున్న గైక్వాడ్ కైలాష్‌కుమార్ నిందితుడు అని తెలిపారు. సదరువ్యక్తి గతంలో మూడు నెలలుగా మాస్క్ కట్టుకొని కొత్తగూ డెం పట్టణ పరిసరప్రాంతాలలోని వివిధ ఏరియాలలోని పోస్ట్ బాక్స్‌లలో అసభ్యకరమైన పదజాలంతో మత పరమైన విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా, కొత్తగూడెం బాబు క్యాంపు ఏరియాలోని కొంతమంది మహిళలపై కూడా అసభ్యకరంగా వర్తిస్తూ లేఖలను రాసినట్లు నిందితుడు అంగీకరించారన్నారు. గత సంవత్సరం నవంబరులో జీహాద్ పేరుతో బాబుక్యాంపు లోని వెంకటేశ్వరస్వామి దేవాలయానికి బెదిరింపు లేఖ పంపించిన విషయంలో సదరు వ్యక్తిపై మొదటి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. హిందూ దేవాలయాలకు ముస్లీంల పేరుతో మసీదులకు హిందువుల పేరుతో మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా లేఖలు పంపుతున్న ఈ నిందితునిపై చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఆరు కేసులను నమోదు చేశామని తెలిపారు. నిందితున్ని పట్టుకోవడానికి చాకచక్యంగా వ్యవహరించిన కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, చుంచుపల్లి సీఐ పెద్దన్నకుమార్, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌ను ఎస్పీ అభినందించారు.

మూటాపురం, వైరాలో విద్యుత్ మోటార్ల చోరీ

నేలకొండపల్లి/వైరా, జనవరి 25: మండల పరిధిలోని మూటాపురం గ్రామానికి చెందిన ఇద్దరు రైతుల పొలాల వద్ద ఉన్న విద్యుత్ మోటార్లను బుధవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్ళారు. వివరాల ప్రకారం మూటాపురం గ్రామానికి చెందిన గుగులోతు రామచంద్రం, ఏలూరు ప్రవీణ్ గురువారం తెల్లవారుఝామున మోటార్లు వేయటానికి పొలాల వద్దకు వెళ్లారు. కానీ అక్కడ మోటార్లు లేవు. గడ్డలు మాత్రమే ఉన్నాయి. దీంతో రైతులు నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇది మొదటి సారి కాదు..

మండల వ్యాప్తంగా వ్యవసాయ మోటార్లను ఎత్తుకెళ్ళటం ఇదేమీ మొదటి పారి కాదు. గత రెండు మూడు నెలల కాలంలో పదుల సంఖ్యలో వ్యవసాయ మోటార్లు చోరీకి గురయ్యాయి. అక్టోబరులో మూటాపురం లిఫ్టుకు సంబంధించి ఎన్నెస్పీ కాల్వకట్టపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ విప్పుతుండగ చూసిన రైతులు వెంటపడగా దొంగలు పారిపోయారు. కానీ పారిపోతూ టీఎస్07 జీజే4023 నెంబరు గల కారును వదిలిపోయారు. ఆకారును పోలీసులకు అప్పగించారు. ఆ కేసు ఏమైందో ఇప్పటి వరకు తెలియదు. దొంగతనాలు జరుగుతున్నప్పటికీ పోలీసులు మాత్రం దొంగలను పట్టుకోవటంలో ఎటువంటి పురోగతి సాధించినట్లు కనపడటంలేదు.

విప్పలమడకలో కరెంట్ మోటార్..

వైరా: మండలంలోని విప్పలమడక గ్రామంలో గరిడేపల్లి సత్యనారాయణ అనే రైతుకు చెందిన వ్యవసాయ మోటార్‌ను బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. వైరా రిజర్వాయర్ ఎడమకాల్వపై రైతు సత్యనారాయణ తన భూమిలో సాగునీటి కోసం ఏర్పాటుచేసిన విద్యుత్ మోటారు, ఫుడ్‌వాల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. వీటి విలువ రూ.40వేల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. గురువారం ఉదయం వ్యవసాయ మోటారు వద్దకు వెళ్లగా చోరీకి గురైనట్లు బయటపడింది.

గోదావరి ఒడ్డున గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



గుర్తుతెలియని మృతదేహం

భద్రాచలం, జనవరి 25: భద్రాచలంలోని గోదావరి వారధి ఒడ్డున గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. 50 సంవత్సరాల వయస్సు కలిగి నీలం రంగు చొక్కా, లుంగీ ధరించి ఉన్నట్లు సీఐ నాగరాజు తెలిపారు. మృతుని వేలికి వినాయకుని బొమ్మ కలిగిన ఇత్తడి ఉంగరం ఉంది. వివరాలు తెలిసిన వారు భద్రాచలం పట్టణ పోలీసు స్టేషన్ 8712682106 నెంబరుకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

పనితీరుకు ప్రశంస

గణతంత్ర దినోత్సవ వేళ భద్రాద్రి జిల్లా అధికారులకు పతకాలు, పురస్కారాలు

మణుగూరు వాసి 'జైలర్ రామయ్యకు' రాష్ట్రపతి అవార్డు

పంజాగుట్ట ఏసీపీ, ఎస్పీఎఫ్ కమాండెంట్‌కు కేంద్ర సేవా పతకాలు

వీరు దమ్మపేట మండల వాసులు .. పలువురు ప్రముఖుల హర్షం

గణతంత్ర దినోత్సవ వేళ భద్రాద్రి జిల్లా వాసులైన అధికారులకు పతకాలు, పురస్కారాల పంట పండింది. వారి పనితీరుకు మెచ్చిన కేంద్ర ప్రభుత్వం పలు పతకాలకు, పురస్కారాలకు ఎంపిక చేసింది. ఇలా పతకాలకు, పురస్కారాలకు ఎంపికైన వారిలో మణుగూరు మండల వాసి జైలర్ రామయ్య ఉన్నారు. ఈయన విధి నిర్వహణకు మెచ్చి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి పురస్కారానికి ఎంపిక చేసింది. దమ్మపేట మండల వాసులు పంజాగుట్ట ఏసీపీగా, ఎస్పీఎఫ్ కమాండెంట్‌గా పని చేస్తున్న మోహన్‌కుమార్, నరకుళ్ల త్రినాథ్ జాతీయ పోలీస్ మెడల్స్‌కు ఎంపికయ్యారు. వీరికి పతకాలు, పురస్కారాలకు రావడంతో భద్రాద్రి జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రామయ్య, మోహన్ కుమార్, నరుకుళ్ల త్రినాథ్



జైలర్ రామయ్యను అభినందిస్తున్న మంత్రి పొంగులేటి, జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా

మణుగూరుటౌన్/ దమ్మపేట, జనవరి 25: మణగూరు మండలం రామానుజవరానికి చెందిన జైలర్ ఏడారి రామయ్య అలి యాస్ రాంబాబుకు రాష్ట్రపతి మెరిటోరియస్ సర్వీస్-2024 పురస్కారం దక్కింది. ఈ పురస్కారాన్ని రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోనున్నారు. దీంతో స్వగ్రామం రామానుజవరంతో పాటు మణుగూరు మండలంలోని మిత్రులు, బంధువులు, సన్నిహితులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

అంచెలంచెలుగా ఎదిగిన రామయ్య

ఏడారి రామయ్య తన పాఠశాల, ఇంటర్ చదువును ఇక్కడే పూర్తి చేశారు. భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ పూర్తి చేశారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలో 4వ ర్యాంకు సాధించారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఎంఏ ఎకనామిక్స్ పూర్తి చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన రామయ్య 1999 డిప్యూటీ జైలర్‌గా ఉద్యోగాన్ని సాధించారు. రాజమండ్రి, చర్లపల్లి కేంద్ర కారాగారాలు, విజయవాడ జైల్‌లో విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం ప్రిజన్ హెడ్ క్వార్టర్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

అభినందించిన పొంగులేటి, జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్రా

కేంద్ర ప్రభుత్వం జనవరి 26 రిపబ్లిక్ డే సందర్భంగా ఇచే 2024 రాష్ట్రపతి మెరిటోరియస్ (యోగ్యత కలిగిన) సర్వీస్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటీ శ్రీనివాస్‌రెడ్డి రామయ్యను అభినందించారు. జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రాతోపాటు హోం సెక్రటరీ, ఐజీలు, డీఐజీలు రామయ్యను ప్రత్యేకంగా అభినందించారు.

ఎస్సై నుంచి మోహన్‌కుమార్ ఉద్యోగ జీవితం ప్రారంభం

దమ్మపేట మండలానికి చెందిన ఇద్దరు పోలీస్ అధికారులకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఇండియన్ పోలీస్ మెడల్స్ (కేంద్ర ప్రభుత్వ ఉత్తమ సేవా పతకం)కు ఎంపికయ్యారు. దమ్మపేట మండలం పట్వారిగూడేనికి చెందిన శ్రీరాముల మోహన్ కుమార్ కేంద్రప్రభుత్వం ప్రకటించిన పోలీస్ మెడల్‌కు ఎంపికయ్యారు. మోహన్‌కుమార్ ప్రస్తుతం హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పంజాగుట్ట ఏసీపీగా విధులు నిర్వహిస్తున్నారు. పోలీస్‌శాఖకు చేసిన సేవలకు గానూ ఇండియన్ పోలీస్ మెడల్ ప్రకటించింది. మెహన్ కుమార్ ప్రాథమిక విద్యను పట్వారీగూడెంలో, 10వతరగతి దమ్మపేట జడ్పీపాఠశాలలో, ఇంటర్, డిగ్రీ సత్తుపలి వెంగళ రావు ప్రభుత్వ కళాశాల, పీజీ హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పూర్తి చేశారు. పోలీస్‌శాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం ప్రారంబించి వివిధ హోదాలలో పని చేసి పదన్నోతులు పొందుతూ ప్రస్తుతం పంజాగుట్ట ఏసీపీగా పని చేస్తున్నారు. చార్మినార్, మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్ లో స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా సమర్థవంతంగా విధులు నిర్వహించి ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారు. కోవిడ్ ఉధృతంగా ఉన్న సమయంలో ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా సూర్యాపేట డీఎస్పీగా పని చేసి ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారు. సర్వీసులో ఇప్పటి వరకు 516 క్యాష్ రివార్డులతో పాటు, జీఎస్ఈ ఎమ్ఎస్ఈ, కమెమడేషన్స్‌తో పాటు కేంద్ర ప్రభుత్వం నుంచి ఉత్కృష్ట సేవాపతకం కేంద్రహోంశాఖ మంత్రి నుంచి పతకం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి పురస్కారాలు పొందారు.

నరకుళ్ల త్రినాథ్ రావు సేవలను గుర్తించి..

దమ్మపేట మండలం నాచారం గ్రామానికి చెందిన నరుకుళ్ల త్రినాథ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో స్పెషల్ ప్రొటెక్షన్‌ఫోర్స్ విధులు నిర్వహిస్తున్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా కేంద్రప్రభుత్వం త్రినాథ్‌కు ఉత్తమసేవా పతకానికి ఎంపిక చేసింది. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో వివిధ స్థాయుల్లో పని చేస్తూ ఉత్తమ సేవలకు గాను త్రినాథ్‌కు కేంద్రప్రభుత్వ సేవా పతకానికి ఎంపిక చేసింది. ఆయన ప్రాథమిక విద్య నాచారం పాఠశాల, 8 నుంచి 10 వరకు గంగారం జడ్పీపాఠశాల, ఇంటర్ సత్తుపల్లిలోని బండిశోభానాచలం కళాశాల, డిగ్రీ సత్తుపల్లి జేవీఆర్ కళాశాలలో, పీజీ ఉస్మానియా, బీఈడీ, ఎంబీఏ హైదరాబాద్‌లో చదివారు.ప్రొటెక్షన్‌ఫోర్స్ సబ్‌ఇన్స్‌పెక్టర్‌గా పోలీస్ శాఖలో తన కెరీర్ ప్రారంభించారు. పదన్నోతులు పొందుతూ కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సెక్రరిటియేట్‌కు ప్రత్యేక అధికారిగా విధులు నిర్వహించి ప్రశంశలు పొందారు. కేంద్ర, రాష్ట్రాల నుంచి పలు పతకాలు పొందారు. కమాండెంట్‌గా చేసిన పలు చేవలకు గానూ కేంద్ర ప్రభుత్వం ఉత్తమసేవా పతకానికి ఎంపిక చేసింది. కేంద్రప్రభుత్వం నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో దమ్మపేట మండలానికి చెందిన ఇద్దరు అధికారులు పతకాలు అందకోనున్నారు. దమ్మపేట మండలానికి చెందిన ఇద్దరు పోలీస్‌శాఖలో కేంద్ర ప్రభుత్వ ఉత్తమ సేవా పతకాలు ఎంపిక కావటం పట్ల పామాయిల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్ర ప్రసాద్, జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ ఎల్లిన రాఘవరావు, మురళి, ఎర్రగొర్ల రాధాకృష్ణ, కొయ్యల అచ్యుతరావు, ఎర్రా వసంతరావు, కాసాని నాగప్రసాద్, కేవీ సత్యనారాయణ, దారా యుగంధర్ అభినందించారు. మండలం ఖ్యాతిని ఇనుమడింపజేశారని కొనియాడారు.



'75' రూపంలో విద్యార్థుల ప్రదర్శన

వజ్రోత్సవ గణతంత్రానికి అంకె రూపం

భద్రాచలం, జనవరి 25: వజ్రోత్సవ గణత ంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని 75ను అంకెల రూపంలో భద్రాచలంలోని సె యింట్‌పాల్స్ లూథరన్ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించారు. శు క్రవారం 75వ గణతంత్ర దినోత్సవం నిర్వహించనుండగా.. ఈ వేడుకల ప్రాధాన్యతను తెలిపేందుకు పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు వజ్రోత్సవానికి గుర్తుగా 75వ అంకెల రూపాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా వజ్రోత్సవ గణతంత్ర వేడుకల ప్రాధా న్యతను పాఠశాల ప్రిన్సిపాల్ డా. కె.రాధామంజరి, ప్రిన్సిపాల్ కె.అబ్రహం విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో జాతీయ పతాక ప్రదర్శన

తల్లాడ, జనవరి 25: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని తల్లాడ మండలం కొత్త వెంకటగిరి గ్రామంలో గురువారం డ్రోన్ కెమెరాతో జాతీయ పతాక ప్రదర్శన నిర్వహించారు. సేంద్రీయ వ్యవసాయ నిర్వాహకుడు సామినేని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరాతో త్రివర్ణ పతాకాన్ని మండలంలోని గగనవీధుల్లో ప్రదర్శించారు. ఈ జాతీయ పతాకం ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది.

జాతీయజెండాతో డ్రోన్ చక్కర్లు →



నిధులెక్కడ తల్లీ?

- పాల్వంచ పెద్దమ్మతల్లి ఆలయ నిర్వహణపై ఆరోపణలు
- ఇష్టానుసారంగా అధికారులు, సిబ్బంది
- పక్కదారి పడుతున్న భక్తుల విరాళాలు
- రూ.15వేలు ఇస్తే రూ.51కే రశీదు
- ఆలయంలో డిప్యూటీ కమిషనర్ ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్

పెద్దమ్మతల్లి ఆలయం



పాల్వంచ, జనవరి 25: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన పాల్వంచలోని శ్రీకనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మగుడి) నిర్వహణ తీరుపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ అధికారులు, సిబ్బంది ఎవరికి తోచినట్లు వారు వ్యవహరిస్తునట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "నేను కొట్టి నట్లు చేస్తాను.. నువ్వు ఏడ్చినట్లు చేయి" అన్న చందంగా అధికారులు, సిబ్బంది కూడబలుక్కొని పనులు చక్కబెడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ఈ ఆలయాన్ని నిత్యం భారీ సంఖ్యలో భక్తులు దర్శిస్తారు. ఈ క్రమంలో తమ కోర్కెలు తీర్చిన తల్లికి భక్తులు వివిధ రూపాల్లో మొక్కులు చెల్లించుకుంటారు. మరి కొందరు హుండీలో కానుకలు వేసి ఆలయ అభివృద్ధికి తమ వంతుగా సహకరిస్తుంటారు. మరి కొందరు పెద్ద మొత్తంలో విరాళాలు ఇస్తుంటారు. అయితే అమ్మవారి అలయ అభివృద్ధికి, పూజలకు, ఉత్సవాలకు, గుడిలో నిర్వహించే వివిధ కార్యక్రమాలకోసం దాతలు ఇచ్చే విరాళాలు ఎటు వెళుతున్నాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది. కొందరు దాతలు ఇచ్చిన చీరలు, బియ్యం, గోవులు తదితర దానాలకు రశీదులు ఇవ్వడం లేదని, వాటికి లెక్కా పత్రం లేకుండా పోయిందని భక్తులు ఆరోపిస్తున్నారు. పినపాక పట్టినగర్‌కు చెందిన ఓ భక్తుడు దేవీనవరాత్రుల నిర్వహణ కోసం రూ.15వేలు ఇచ్చాడు. అతడి నుంచి ఆ మొత్తాన్ని ఓ అర్చకుడి అకౌంట్‌కు ఫోన్‌పేలో బదిలీ చేయించుకుని సదరు దాతకు మాత్రం కేవలం రూ.51ల రశీదును చేతులో పెట్టారు. దీంతో విస్తు పోయిన ఆ భక్తుడు అధికారులను, సిబ్బందిని ప్రశ్నిస్తే తాము ఇంతకే రశీదు ఇస్తామని తెగేసి చెప్పారట. ఇటువంటివి అనేకం ఉన్నాయని పలువురు విమర్శిస్తున్నారు. ఈ విషయం ప్రజల్లోకి వెళ్లడంతో ప్రస్తుతం తీవ్ర చర్చ జరుగుతోంది. ఎందరో ఎన్నో రకాల దానాలు, విరాళాలు అందిస్తున్నా అధిక శాతం రశీదులు ఇవ్వట్లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దాతలు సమర్పించిన సొమ్ము ఆలయ అభివృద్ధికి వినియోగించాలని భక్తులు కోరుకుంటున్నారు.

ఆలయంలో డిప్యూటీ కమిషనర్ ఆకస్మిక తనిఖీ

దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతరావు గురువారం పెద్దమ్మతల్లి ఆలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తన బృందంతో కలిసి ఆలయంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను, ఎండోమెంట్ ఆధీనంలో ఉన్న దుకాణాలను, ఫంక్షన్‌హాళ్లు, కౌంటర్లను పరిశీలించారు. అనంతరం గుడి పక్కనే నూతనంగా నిర్మిస్తున్న శివాలయాన్ని పరిశీలించారు. ఈ క్రమంలోనే ఆలయ కార్యనిర్వహణాధికారి రజనీకుమారి పర్యవేక్షణ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గుడి నిర్మాణానికి డబ్బులు ఇవ్వకుండానే దాత పేరును శిలా ఫలకంపై ఎలా పెట్టారని, ఎంబీలు ఎలా సిద్ధం చేశారని, ఫంక్షన్‌హాల్స్‌లో సీసీ కెమెరాలను ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. ఈ సమయంలో చండీ హోమం పూర్తి చేసుకున్న భక్తులు ఆలయ ప్రాంగణంలో నిల్చుని భోజనం చేస్తుండగా గమనించిన డిప్యూటీ కమిషనర్ రూ.2,500 చెల్లించే భక్తులకు కనీసం కుర్చీలు కూడా ఏర్పాటు చేయకపోవడంపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరిగా ఈవో కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా దాతలకు రశీదులు ఇవ్వని వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి' ఆయనను వివరణ కోరగా రశీదుల వ్యవహారంపై విచారణ చేస్తామని తెలిపారు. శివాలయ నిర్మాణానికి విరాళాలు సేకరిస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో తాము ఆకస్మికంగా తనిఖీ చేశామని, పూర్తిస్థాయిలో విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



దాత జరిపిన ట్రాన్సాక్షన్ , దాతకు ఇచ్చిన రశీదు

మామిడి పూత.. కష్టాల కలబోత

- అనూహ్యంగా మారిన వాతావరణం
- తేమ పెరగడంతో రాలుతున్న ఆ కాస్త పూత
- పురుగులమందులు వాడినా ప్రయోజనం శూన్యం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి
- గతేడాది పండు ఈగతో అపారనష్టం
- అన్నదాతల్లో ఆందోళన



పూత రాని మామిడి తోటల్లో పురుగుల మందు పిచికారీ చేస్తున్న రైతులు

కల్లూరు, జనవరి 25: వాతావరణ పరిస్థితులన్నీ అనుకూలిస్తే.. మామిడి చెట్లు శివరాత్రి వరకే శివలింగమంత పరిణామంలో కాయలు కాస్తాయి. అక్టోబర్‌లోనే మామిడి సీజన్ ప్రారంభమై డిసెంబర్ చివరి నాటికి తోటలు 90 శాతం పూత పూస్తాయి. మామిడి పంట పిందె దశ ప్రారంభమవుతంది. అలాంటిది.. ఈ సారి జనవరి మొదటి వారం దాటినా పూత పూయలేదు. ఫలితంగా తోటల్లోని చెట్లు మొండిగా దర్శనమిస్తున్నాయి. ఇందుకు వాతావరణ మార్పులు, అధికమైన చలి తీవ్రతే కారణమని రైతులు చెప్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే.. ఈసారి మామిడి పంట దిగుబడులు లేనట్టేనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారే కాదు మామిడి పండ్లతో రూ.కోట్లల్లో వ్యాపారం నిర్వహించే పండ్ల వ్యాపారులు, మామిడి పండ్లను ఆస్వాదించే ప్రియులు నిరాశ చెందు తున్నారు.

మామిడి రైతుల ఆందోళన

వాతావరణంలో ప్రతికూల మార్పుల కారణంగా ఈ సీజన్‌లో మామిడి తో టలకు ఇప్పటికీ పూత రాలేదు. చల్లని వాతావరణం, మంచు కురుస్తుం డటంతో ఇప్పట్లో పూత వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. డిసెంబర్‌లోపే పిందెలు పట్టాల్సిన తోటలు.. ఇంకా పూత పట్టక పోవడంతో రైతులు ఆందోళన చెందుతు న్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండ లాల్లో ఇదే పరిస్థితి ఉన్నది. మామిడి పూసేందుకు జనవరి ఆఖరి వరకు అదును ఉన్నా.. ఆలస్యంగా పూత వస్తే పంట దిగుబడి తగ్గుతుందని రైతులు చెప్తున్నారు. అలాగే.. కాయ లు లేటుగా కాసి.. వానకాలం మొదలైన తర్వాత పండు దశ కు వస్తాయని, మే నెలలో గాలివా నలతో పంట చేతికి రా కుండాపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. దీన్నిబట్టి ప్రస్తుత సీజన్‌లో మామిడి తోటల పరిస్థితి ఆశాజనకంగా లేదని రైతులు వాపో తున్నారు. సాధారణంగా డిసెంబర్, జనవరిలో చలి తీవ్రత ఉన్నా.. రాత్రి, పగలు ఉ ష్ణోగ్రతల మధ్య తేడా ఎక్కువగా ఉంటుంది. రాత్రి బాగా చలి, మధ్యాహ్నం ఎండ ఎక్కువ ఉంటుంది. ప్రస్తుత సీజన్ లో రాత్రి తీవ్రమైన చలితోపాటు పగలు కూడా చలి ప్రభా వం ఉంటున్నది. వేడి వాతావరణం ఉండటం లేదు. రాత్రి, పగటి ఉష్ణోగ్రతలలో తేడా ఎక్కువగా ఉన్నప్పుడే మామిడి పూతకు అనుకూల వాతావరణం ఉంటుంది. ఇప్పుడు రాత్రి, పగలు చలి వాతావరణం ఎక్కువగా ఉండటంతో మామిడి చెట్లలో పూత ప్రక్రియ కనిపించడం లేదని రైతులు చెబుతున్నారు.

వాతావరణ మార్పులతోనే

వాతావరణంలోని మార్పులు అన్ని పంటలపైనా ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుత సీజన్‌లో మామిడిపై దీని ప్రభావం ఎక్కువగా ఉన్నది. డిసెంబర్ మామిడి పూతకు మంచి సీజన్. రాత్రి, పగలు ఉష్ణోగ్రతలో ఎక్కువగా తేడా ఉన్నప్పుడు మామిడి చెట్లలో అంతర్గతంగా ఒకరకమైన ఒత్తిడి కలిగి పూత ప్రక్రియ వేగంగా జరుగుతుంది. ఈ సారి పగటి ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటంతో మామిడి పూత రావడం లేదు. జనవరి ఆఖరు వరకు మామిడి పూతకు అనువైన పరిస్థితి ఉంటుంది. కానీ ఈ ఏడాది అలాంటి పరిస్థితి కన్పించడం లేదు. మొగ్గలు వచ్చిన చెట్లకు, నేల స్వభావానికి అనుగుణంగా అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టినప్పటికీ ఉపయోగం లేకుండా పోతోందని రైతులు వాపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో వేలాది ఎకరాల్ల మామిడితోటలు విస్తరించి ఉన్నాయి. మెరుగైన కాపు కోసం తోటలను కౌలుకు తీసుకున్న రైతులు దుక్కి దున్నడం, ఎరువులు, పై పాటుగా పిచికారి మందుల వినియోగం కోసం రూ. 15 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. పూత నిలిచేందుకు మాడు సార్లు పై పాటుగా మందులు పిచికారీ చేశారు. అంతా బాగుంటుంది అనుకుం టున్న తరుణంలో పూత రాలడం రైతులను కలతకు గురి చేస్తోంది.

కౌలు రైతుల పరిస్థితి దారుణం....

మామిడి తోటలను యాజమానుల నుంచి ఎక్కువగా తోటలను రైతులు గుత్తకు తీసుకొంటారు. అదే తరహాలో ఈ సీజన్‌లో కూడా ఎకరం మామిడి తోటను రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు గుత్తగా తీసుకొన్నారు. వాతావరణలో మార్పుల వల్ల తోటల్లో కేవలం పదిశాతం మాత్రమే పూత కని పిస్తోందని రైతులు అంటున్నారు. వాతావవరణం చల్లగా ఉండటంతో కాసి న పూత కూడా తెగులు సోకి రాలి పోతోంది. జనవరి నెల లోగా మామిడిలో పూసిన ఆ కాస్త పూత నిలబడితేనే పిందె సక్రమంగా వచ్చే అవకాశం ఉం దని రైతలం టున్నారు. అసలే గత ఏడాది సీజన్‌లో మధ్యలో తుఫా న్ రావటంతో పండు ఈగ ఆశించడంతో కాయలో కుళ్లు ఏర్పడింది. దీంతో రైతులు తీవ్రంగా నష్ట పోయారు. గత సీజన్‌లో ప్రారంభ దశలో నాణ్యంగా ఉన్న మా మిడి టన్నుకు రూ.60 నుంచి రూ.70 వేల వరకు ధర పలికింది. తెగులు వ్యాప్తితో కాయ కుళ్లటంతో అది రూ. ఏడు వేలకు పడిపోయింది. ప్రస్తుతం తోటల్లో పూత రాలుతున్నా.. ఉద్యాన అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించడం లేదని రైతులు వాపోతున్నారు.

కలెక్టర్ దృష్టికి విజయ వివాదం

కొందరు పాడి రైతులు దుష్ప్రచారం చేస్తున్నారని వినతిపత్రమిచ్చిన సమాఖ్య అధ్యక్షుడు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న పాల ఉత్పత్తిదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు, పాడిరైతులు

విజయ డెయిరీలో డీడీ, మేనేజర్‌తో కలిసి పాలను పరీక్షిస్తున్న పాడి రైతులు

ఖమ్మంకార్పొరేషన్, జనవరి 25: విజయ డెయిరీలో పాలలో వెన్నశాతం తగ్గిస్తున్నారని కొందరు పాడిరైతులు బుధవారం డెయిరీ ఎదుట ధర్నా చేయగా, వారు దుష్ప్రచారం చేస్తున్నారని జిల్లా పాల ఉత్పత్తిదారుల సమా ఖ్య అధ్యక్షుడు బోజెడ్ల వెంకటయ్య ఆధ్వర్యంలో పలువురు పాడిరైతులు జిల్లా కలెక్టర్ వీపీ. గౌతమ్‌ను కలిసి గురువారం వినతిపత్రం ఇచ్చారు. సదరు పాడిరైతులపై చర్య తీసుకోవాలని కోరారు. తాము పోసే పాలలో వెన్నశా తం తగ్గించి చూపి, డెయిరీలోని కొందరు ఉద్యోగులు అవినీతికి పాల్పడుతున్నారని కొందరు పాడిరైతులు గతం లో పాడిపరిశ్రమాభివృద్ధి సమాఖ్య ఎండీ చిట్టెం లక్ష్మికి విన తిపత్రం ఇచ్చారు. బుధవారం ఖమ్మంలోని విజయ డెయిరీ ఎదుట ధర్నాచేశారు. కాగా గురువారం జిల్లా పాల ఉత్పత్తిదారుల సమాఖ్య అధ్యక్షుడు బోజెడ్ల వెంకటయ్య ఆధ్వర్యంలో పలువురు పాడిరైతులు విజయ డెయిరీకి వచ్చారు. డెయిరీ డీడీ కుమారస్వామి, మేనేజర్ సిద్ధు సమక్షంలో పాలనాణ్యతను, వెన్నశాతాన్ని పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ వీపీ.గౌతమ్‌ను కలిశారు. జిల్లాలో విజయ డెయిరీకి పాలుపోసే పాడి రైతులు సుమారు 4వేలమంది ఉన్నారని, డెయిరీ పరిధిలోని సుమారు 300 గ్రామాలనుండి 12వేల లీటర్ల పాలు సేకరిస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు. కేవలం 3,4 కేంద్రాల నుంచి పాలు సేకరించే ఉత్పత్తిదారులు నాణ్యత లేని క్షీరాన్ని విజయ డెయిరీకి సరఫరా చేస్తుండగా, వాటిని తిరస్కరించటంతో విజయ డెయిరీపై వారు దుష్ప్రచారం చేస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు. వివిధ గ్రామాల పాల ఉత్పత్తాదారుల సహకార సంఘాల అధ్యక్షులు, పాడిరైతులు గురువారం డెయిరీకి వచ్చి పాలశాంపిల్స్‌ను అనలైజర్, గర్బర్ పరీక్షల ద్వారా చూస్తే వెన్నశాతంలో ఎటువంటి తేడా లేదన్నారు. అభివృద్ధి చెందుతున్న విజయ డెయిరీపై దుష్ప్రచారం చేస్తూ, పాడిరైతులకు నమ్మకాన్ని పోగొడుతున్న సదరు పాల ఉత్పత్తిదారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. 300 పాలసేకరణ కేంద్రాల్లో పాలు పోసే పాడిరైతులు ఎటువంటి విధంగా నష్టపోవటం లేదని, కేవలం 4కేంద్రాలనుండి పాలుసేకరించేవారే ఉద్యోగులపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని, వారిపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని కోరారు. పాల ఉత్పత్తిదారుల పెండింగ్ బిల్లులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సమాఖ్య అధ్యక్షుడు, పాల ఉత్పత్తిదా రులు కలెక్టర్ వీపీ. గౌతమ్‌కు విజ్ఞప్తి చేశారు.

అటవీ ప్రాంతాలలో ఫైర్‌లైన్లను ఏర్పాటు చేయాలి



అటవీ ప్రాంతంలో ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న కోటేశ్వరరావు

జూలూరుపాడు, జనవరి 25: అటవీ ప్రాంతాలలో అగ్గి రగలకుండా, మొక్కలు కాలిపోకుండా ఫైర్‌లైన్లను ఏర్పాటు చేయాలని కొత్తగూడెం ఎఫ్‌డీవో కోటేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన జూలూరుపాడు రేంజ్ పరిధిలోని రాజారావుపేట, వినోభానగర్, అటవీ ప్రాంతాలను సందర్శించారు. గత ఏడాది రెండు అటవీ ప్రాంతాలలో చేపట్టిన ప్లాంటేషన్‌ను పరిశీలించారు. మారు జాతి మొక్కల పెంపకం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవిలో మొక్కలను సంరక్షించే విధంగా సిబ్బంది చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి అటవీ ప్రాంతాలలో నిప్పు అంటించకుండా ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. అడవి జంతువులను వేటాడకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాత్రి వేళల్లో సిబ్బంది గస్తీ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఆర్వో ప్రసాద్‌రావు, ఎఫ్ఎస్‌వో సలీం, సిబ్బంది, రహీం, కిషన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఖర్గేకు ప్రసాదరెడ్డిని పరిచయం చేసిన పొంగులేటి

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 25: లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ హైదరాబా ద్‌లో గురువారం బూత్ లెవల్ కార్యక ర్తల సమావేశం నిర్వహించింది. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి కూడా హాజరయ్యారు. ఈక్రమంలో ఆయ నను ఆయన సోదరుడు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మల్లికార్జున ఖర్గేకు పరిచయం చేశారు. ఎల్‌బీ స్టేడియంలో బూత్ లెవల్ సమావేశం సందర్భంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వద్దకు తన సోదరుడు ప్రసాదరెడ్డిని పిలిపించిన పొంగులేటి శ్రీనివాస రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలోనే పరిచయం చేయించడం విశేషం.




ప్రసాదరెడ్డిని ఖర్గేకు పరిచయం చేస్తున్న శ్రీనివాసరెడ్డి



తమ్మినేనిని పరామర్శిస్తున్న విజయరాఘవన్, పోతినేని

కోలుకుంటున్న తమ్మినేని వీరభద్రం

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 25: అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోలుకుంటున్నారు. గురువారం ఆయన ఐసీయూ నుంచి సాధారణ వార్డుకు వైద్యులు మార్చులు చేశారు. కాగా సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు విజయ రాఘవన్‌తో పాటుగా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కమిటీ సభ్యుడు ఎస్ నవీన్‌రెడ్డి, రాయల శ్రీనివాస్, సంఘమిత్ర తమ్మినేని కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ తమ్మినేని వీరభద్రానికి గుండెకు వైద్యులు పేస్ మేకర్‌ను ఏర్పాటు చేశా రని, తమ్మినేని సాధారణ స్థాయికి చేరుకుంటున్నారని తెలిపారు.



ఏఆర్ కానిస్టేబుళ్లకు సీపీ అభినందన



ఖమ్మంక్రైం, జనవరి25: బంగారు పతకాలు సాధించిన ఏఆర్ కానిస్టేబుళ్లను పోలీసుకమిషనర్ సునీల్‌దత్ అభినదించారు. జనవరి 21న ముంబయిలో జరిగిన 42.195కి.మీ. టాటా ముంబై మరాథాన్‌రన్‌లో విజేతలుగా నిలిచారు. పిల్లిరాజు, ఆర్.గోపి, సీహెచ్.శ్రీనివాస్, ఎస్కే రఫి, కె.సురేష్‌కుమార్ బంగారు పతకాలు సాధించారు. వారిన సీపీ తన కార్యాలయంలో అభినందించారు. ఈకార్యక్రమంలో ఏఆర్ అదనపు డీసీపీ కుమారాస్వామి, ఏసీపీలు సుశీల్‌సింగ్, నరసయ్య, ఆర్‌ఐలు కామరాజు, పాల్గొన్నారు.

ఘనంగా ఓటరు దినోత్సవం

నెట్‌వర్క్: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీలు నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటర్లను చైతన్య పరుస్తూ, ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. తల్లాడ మండలం కొత్త వెంకటగిరి గ్రామంలో గురువారం డ్రోన్ కెమెరాతో జాతీయ పతాక ప్రదర్శన నిర్వహించారు.

రిపబ్లిక్ డే వేడుకలకు గొల్లగూడెం విద్యార్థి

ఖమ్మంరూరల్:దేశరాజధానిలో నిర్వహిస్తున్న రిపబ్లిక్ డే వేడుకలకు మండల పరిధిలోని గిరిజన ఆశ్రమ బాలికలు ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థిని వాంకుడోతు విలాసిని వెళ్లనున్నారు. ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో ప్రతిభ కనబర్చిన రాష్ట్రవ్యాప్తంగా 30మంది గిరిజన విద్యార్థులను ఇందుకోసం ఎంపిక చేశారు.



వైరాలో ర్యాలీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్



బోనకల్‌లో...



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఈ సురేందర్, డీఈలు, ఏడీఈలు



తల్లంపాడులో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



కల్లూరులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



కొణిజర్లలో సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న దృశ్యం



మధిరలో...



ఠాగూర్ విద్యాలయంలో..



పెనుబల్లిలో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు



సత్తుపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉద్యోగులు



కారేపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



పిండిప్రోలులో...



చింతకాని కూడలిలో ప్రతిజ్ఞ చేస్తున్న ఓటర్లు

'పది' విద్యార్థులకు తోపుడుబండి ఫౌండేషన్ చేయూత

కల్లూరు, జనవరి25 కల్లూరులోని బాలికోన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు తొపుడుబండి ఫౌండేషన్ ఆధ్వంలో గురువారం అల్పాహారానికి రూ.25 వేలు, మరో రూ.16 వేల విలువగల గైడ్లు అందజేశారు. సంస్థ అధినేత ఎస్‌కె సాధిక్ అలి చేతుల మీదగా వాటిని అందజేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించటం కోసం మరో రూ, 5 వేలు వితరణ చేశారు. పదిలో 10/10 జీపీఏ సాధించిన వారికి రూ. 25 వేలు ప్రోత్సాహక బహుమతిని అందిస్తానని ప్రకటించారు. ప్రధానోపాధ్యాయులు పద్మ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సాదిక్‌అలిని ఘనంగా సత్కరించారు.

మున్నేరులో నీటినిల్వలు తగ్గకుండా చర్యలు తీసుకోండి: మేయర్

ఖమ్మంకార్పొరేషన్, జనవరి25: నగరప్రజలకు తాగు నీటిని సరఫరా చేసే మున్నేరులో నీటినిల్వలు తగ్గకుండా ఇరిగేషన్ అధికారులతో సంప్రదించి చర్యలు తీసుకోవాలని మేయర్ పునుకొల్లు నీరజ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. గురువారం దానవాయి గూడెంలోని ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలించారు.మున్నేరు చప్టా వద్ద మరమ్మతులు ఉంటే వెంటనే పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈఈ కృష్ణలాల్, ఏఈ కుమార్, ఫిల్టర్‌బెడ్ సిబ్బంది తదితరులున్నారు.

టాలెంట్ టెస్ట్‌లో గీతాంజలి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

ఖమ్మంఖానాపురంహవేలి,జనవరి25: ఆల్ ఇండియా మైచాప్స్ టాలెంట్ టెస్ట్‌లో నగరంలోని గీతాంజలి పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని పాఠశాల కరస్పాండెంట్ టీవి అప్పారావు తెలిపారు. పాఠశాలకు చెందిన 10వతరగతి విద్యార్థులు భవ్య రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంక్ సాధించినట్లు చెప్పారు. మెత్తం 129మంది పరీక్షకు హాజరు కాగా అందులో 31 మంది సెలక్ట్ అయినట్లు తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్లు టి పద్మా, అరుణ్ అభినందించారు.

వైజ్ఞానిక ప్రదర్శన విజేతలకు బహుమతుల ప్రదానం



సర్టిఫికెట్లు అందించిన డీఈవో

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి25: రెజోనెన్స్ పాఠశాలలో నిర్వహించిన 51వ రాష్ట్ర స్థాయి బాలవైజ్ఞానిక ప్రదర్శన 2023 విజేతలకు గురువారం డీఈవో సోమశేఖర శర్మ బహుమతులను జిల్లా సైన్స్ మ్యూజియంలో జరిగిన కార్యక్రమంలో అందించారు. జూనియర్ విభాగంలో 15మందికి, సీనియర్ విభాగంలో 15మంది బహుమతులు అందించారు. పాఠశాలలో ప్రయోగాలతో అవగాహన పెంచుకోవాలని సూచించారు.

భట్టి పౌర సన్మానాన్ని జయప్రదం చేయాలి

చింతకాని, జనవరి25: రేపు మండల కేంద్రంలో నిర్వహించే మల్లు భట్టి విక్రమార్క పౌర సన్మాన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలనిమండల కాంగ్రెస్ అధ్యక్షడు అంబటి వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషి చేయాలి

అధికారులతో కలెక్టర్ సమీక్ష

ఖమ్మంకలెక్టరేట్, జనవరి25: జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై పోలీస్ కమీషనర్ సునీల్‌దత్‌తో కలిసి అధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్లతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చి దిద్దాలన్నారు. మైనర్లు గంజాయి బారిన పడకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలకు దగ్గరగా ఉన్న కిరాణ , పాన్‌షాపులపై నిఘా పెట్టిలని అక్కడ సిగరేట్ పొగాకు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరిన్‌టెండెంట్ నాగేందర్‌రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, డీసీహెచ్ఎస్ డాక్టర్ బి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వలస కూలీలకు దుప్పట్లు పంపిణీ

ఖమ్మంరూరల్, జనవరి25: మండల పరిదిలోని తల్లంపాడు గ్రామంలో చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏకం యూ.ఎస్.ఎ సహకారంతో గురువారం వలస కూలీలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ముత్తినేని సురేష్, చంద్రగానీ నవీన్, షేక్ రషీద్, శివ, రామా, ధర్మరావు, నాగేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

వైరా క్రాస్‌రోడ్డులో భారీ గుంతలు

సీపీఎం ఆధ్వర్యంలో వినూత్న నిరసన



గుంతల్లో పాడెతో నిరసన తెలుపుతున్న నాయకులు

వైరా, జనవరి25: వైరాలోని క్రాస్‌రోడ్డు ఉన్న భారీ గుంతలను వెంటనే పూడ్చాలని డిమాండ్ చేస్తూ వినూత్న రీతిలో సీపీఎం ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈగుంతలను వెంటనే పూడ్చాలని డిమాండ్ చేస్తూ శవంబొమ్మతో ఉన్న పాడెను గుంతల్లో ఉంచి నిరసన తెలిపారు. జాతీయ ప్రధాన రహదారి నుంచి మధిర-జగ్గయ్యపేట వెళ్లే క్రాస్‌రోడ్డు నడిమధ్యలో రెండునెలల కిందట గుంతలేర్పడినప్పటికీ ఇంతవరకు కనీస మరమ్మతులు చేయకపోవడంతో నిరసన వ్యక్తం చేసింది. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, మాజీ ఎంపీపీ బొంతు సమత, పట్టణ, మండల కార్యదర్శులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, పారుపల్లి కృష్ణారావు, కురుగుంట్ల శ్రీనివాసరావు, కొంగర సుధాకర్, షేక్.పాషా, అన్నవరపు వెంకటేశ్వరరావు, గరిడేపల్లి సత్యం, కోట ప్రేమ్, దొడ్డపనేని కృష్ణార్జున్ రావు, తోట కృష్ణవేణి, సుగుణ, రజిని పాల్గొన్నారు.

షటిల్ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన దృశ్యం

మధిరరూరల్, జనవరి25: మధిర మండలం మాటూరు జడ్పీఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు మేడేపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో షటిల్ పోటీలు నిర్వహించారు. బాలుర జూనియర్ సింగిల్స్‌లో పుచ్చా డోలాశంకర్, రన్నర్‌గా మేడిశెట్టి హర్షవర్ధన్, సీనియర్ బాలుర సింగిల్స్‌లో మేడిశెట్టి గణేష్, రన్నర్‌గా కొట్టే మణికంఠ నిలిచారు. డబుల్స్ జూనియర్ విభాగంలో డోలాశంకర్, హర్షవర్ధన్, రన్నర్‌లుగా జశ్వంత్, వేముల నర్సింహారావు, సీనియర్ బాలుర విభాగంలో గణేష్, బాలికల జూనియర్ విభాగంలో మేడిశెట్టి వైష్ణవి, రన్నర్‌గా ఆళ్ల అశ్విని నిలిచారు. సీనియర్ విభాగంలో సామినేని ఉమామహేశ్వరి, రన్నర్‌గా వేముల సిరిచందన, డబుల్స్ విభాగంలో వేముల సిరిచందన, చిలివేరు జయశ్రీ, రన్నర్స్‌గా శీలం విష్ణుప్రియ, ముదిగొండ తేజశ్రీ నిలిచారు. విజేతలకు రూ.మూడువేల విలువైన బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీహరి, మేడేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెరుకు బిల్లులు వెంటనే చెల్లించాలి

నేలకొండపల్లి, జనవరి25: మధుకాన్ షుగర్స్ చెరుకు తోలిన రైతులకు వెంటనే బిల్లులను చెల్లించాలని చెన్నారం సొసైటీ మాజీ అధ్యక్షుడు చింతనిప్పు సైదులు డిమాండ్ చేశారు. నవంబరు 26న చెరుకు క్రషింగ్ ప్రారంభమైందని, ఇప్పటి వరకు దాదాపుగా 1.10లక్షల మె.టన్నుల చెరుకును గానుగ ఆడారన్నారు. అయినప్పటికీ ఇప్పటివరకు కేవలం ఒక్క నెల బిల్లును మాత్రమే చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరుకు బిల్లులు సకాలంలో అందక పోవటంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. కాగా డిసెంబరు వరకు చెరుకు తోలిన రైతులకు బిల్లులను ఆయా బ్యాంకులకు పంపామని, రెండు లేక మూడు రోజుల్లో రైతులకు బిల్లులను బ్యాంకులు చెల్లిస్తాయని మధుకాన్ జీఎం కోటయ్య చెప్పారు. రికవరీ శాతం పడిపోయిందని, పంచదార ధర సైతం మార్కెట్లో పడిపోవటంతో బిల్లుల చెల్లింపులో కొంత జాప్యం జరిగిందన్నారు. రాష్ట్రంలో సకాలంలో చెరుకు బిల్లులను చెల్లించేది మధుకాన్ ఫ్యాక్టరీ మాత్రమేనని కోటయ్య అన్నారు. సాధ్యమైనంత త్వరగా రైతులకు రావలసిన బకాయిలను చెల్లిస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన పని లేద్నారు.

బ్యాంకుల్లో నగదు కొరత

▸▸ ప్రజలకు తీవ్ర ఇక్కట్లు, మూడురోజుల వరుస సెలవులతో జనం గగ్గోలు

వైరా, జనవరి25: అన్నిబ్యాంకుల్లో నగదు కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేకాకుండా శుక్రవారం నుంచి ఆదివారం వరకు వరుసగా మూడురోజులు సెలవుదినాలు కావడంతో నగదు లేక తీవ్ర ఆందోళనతో వెనుదిరిగి వెళ్లిపోయారు. కొంతకాలంగా బ్యాంకుఖాతాదారుల అవసరాల మేరకు నగదు చెల్లించటం లేదు. ముఖ్యంగా రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. వర్షాకాలం వ్యవసాయ సీజన్‌కు సంబంధించిన పంట ఉత్పత్తులను డిసెంబరు మొదటి నుంచి ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించారు. వారంరోజులు వాయిదాలపై పంట ఉత్పత్తులను కొనుగోలు చేసిన దళారులు నెలరోజులు దాటిన తర్వాత అరకొరగా రైతుల ఖాతాల్లో నగదు జమచేశారు. రైతుల చేతికి నేరుగా నగదు ఇవ్వకుండా వారి ఖాతాల్లోకి డబ్బులు బదిలీ చేయడంతో రైతులు నగదు కోసం బ్యాంకుల వద్దకు బారులుతీరారు. అయితే వారి అవసరాల మేరకు బ్యాంకుల్లో నగదు లభ్యత లేక గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాసి ఖాళీచేతులతో వెనుదిరిగి వెళ్లారు. వరికోసిన యంత్రాలకు, ఎరువుల దుకాణాల్లో అలాగే పెట్టుబడి తెచ్చుకున్న వారికి డబ్బులివ్వాల్సి రావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వైరాలోని జాతీయ సహకార గ్రామీణ బ్యాంకుల్లో గురువారం నగదు కొరతతో ఖాతాదారులు సాయంత్రం వరకు వేచి చూసి వెనుదిరిగి వెళ్లారు.

రేపటినుంచి ఆరెంపుల దర్గాలో ఉర్సు ఉత్సవాలు

ఖమ్మం రూరల్, జనవరి 25: మండల పరిదిలోని ఆరెంపులలోని హజ్‌రత్ సయ్యద్ యాఖూబ్ షాహవలీ దర్గాహ్‌లో ఈనెల 27 నుంచి ఉర్సు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ముతవల్లి, దర్గాహ్ షరీఫ్ ఉత్తరాధికారులు మొహ్మద్ నసీర్, షేక్ దావుద్ తెలిపారు. గురువారం ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. 27న రాత్రి గంధం, 28న ఉర్సు మహోత్సవము, 29వ తేదీన దర్గాహ్ చేరి స్వామివారికి ఖందిల్ సమర్పించడంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

నేడు ఖుషీఖుషీగా కామెడీ సందడి

ఖమ్మంసాంస్కృతికం జనవరి25: ప్రముఖ స్టాండప్ కమెడియన్ మెగిలి గుణకర్ ఆధ్వర్యంలో ఖుషీ ఖుషీగా కామెడీ సందడి పేరుతో హాస్య కార్యక్రమం శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో జరుగనుంది. పలు టీవీ చానెళ్లకు చెందిన ప్రముఖ హాస్య కళాకారులు పాల్గొని తమ కళారూపాలను ప్రదర్శించనున్నారు.

చింతకాని-నేరడ రహదారిపై కుంగిన బ్రిడ్జి



చింతకాని, జనవరి25: మండల కేంద్రం నుంచి నేరడ వెళ్లే రహదారిలో దాసరి బంధం వాగుపై ఉన్న బ్రిడ్జి అకస్మాత్తుగా కుంగి, రహదారిపై పెద్ద గోయి ఏర్పడింది. బ్రిడ్జి కుంగి పోవడంతో వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. ఉదయం సమయంలో అటుగా వెళ్తున్న వాహన దారులు బ్రిడ్జి వద్ద గోయి ఏర్పడటాన్ని గమనించి ప్రమాద సూచిగా రాళ్లు, కొమ్మలు అడ్డుగా పెట్టారు.

గ్రామీణ వైద్యుల మండల కమిటీ ఎన్నిక

కారేపల్లి జనవరి25:మండల గ్రామీణ వైద్యుల సంఘం కమిటీని గురువారం ఎన్నుకున్నారు. మండల పరిధిలోని కారేపల్లి క్రాసురోడ్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల అధ్యక్షకార్యదర్శులుగా మండెపూడి వీరయ్య చౌదరి, ప్రధానకార్యదర్శిగా ఆకారపు రఘు, గౌరవఅధ్యక్షుడిగా దాసరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా గణితి సైదులు, గుగులోత్ కృష్ణ,గుగులోత్‌శివ, సహాయకార్యదర్శులుగా బండివెంకటేశ్వర్లు, షేక్ హైమద్ పాష,షేక్‌రఫీను ఎన్నుకున్నారు.

గాంధీనగరం ఎస్బీఐ పరిధిలోకి మరో నాలుగు గ్రామాలు

కారేపల్లి జనవరి25: మండల పరిధిలోని గాంధీనగరం ఎస్బీఐ బ్యాంకులో నాలుగు గ్రామపంచాతీలలోని బ్యాంకు వినియోగదారులకు సేవలు అందిస్తున్నట్లు బ్యాంకు అధికారులు గురువారం తెలిపారు. విశ్వనాథపల్లి, ఉసిరికాయలపల్లి, టేకులగూడెం,తోడితలగూడెం గ్రామపంచాయతీల ఖాతాదారులు ఇకపై ఇక్కడ సేవలు వినియోగించుకోవచ్చు. సామాజిక కార్యకర్త వేముల రాంమూర్తి కృషి ఫలితంగానే బ్యాంకుఅధికారులు ఈనిర్ణయం తీసుకున్నారు.

పంచాయతీ కార్మికులకు ఉద్యోగభద్రత కలిపించాలి

తిరుమలాయపాలెం,జనవరి25: గ్రామపంచాయతీ కార్మికులకు ఉద్యోగభద్రత కలిపించాలని ఆసంఘం జిల్లానాయకులు మీగడ సైదులు ప్రభుత్వాన్ని తెలిపారు. గురువారం తిరుమలాయపాలెంలో మాట్లాడారు. ఈనెల 28న వనపర్తిలో రాష్ట్రమహాసభల విజయవంతం చేయలని కోరారు. ఈకార్యక్రమంలో కత్తుల బిక్షం, నాగన్న, పుల్లయ్య, వెంకన్న, నాగయ్య, ఏసు పాల్గొన్నారు.

యువతకు శిక్షణ

ఖమ్మంబైపాస్‌రోడ్, జనవరి25: యువతలో నైపుణ్యతను పెంపొందించేందుకు 41రకాల కంప్యూటర్స్ కోర్సులను ఉచితంగా శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి కల్పిస్తున్నట్లు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పీవీకే శాస్త్రి, ఏపీపీసీ ప్రాజెక్టు ఇన్‌చార్జి డి. ప్రకాష్ తెలిపారు. తెలంగాణ భవన నిర్మాణ కార్మికశాఖ, ఏపీ, తెలంగాణ ప్రొడక్టివిటీ కౌన్సిల్ ట్రైనినింగ్ డిపార్టుమెంట్ తెలంగాణ భవన నిర్మాణ కార్మికశాఖలో నమోదు అయని కార్మికుల పిల్లలకు ఉచితంగా కేరీర్‌గైడెన్సు, రెస్యూమ్ ప్రిపరేషన్ గురించి ఖమ్మం ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో గురువారం వర్కుషాపు నిర్వహించారు. అనంతరం శిక్షణ కార్యక్రమంలో ప్రాజెక్టు లీడ్‌ర్ దాసరి రాజేంద్ర, మండవ వంశీకృష్ణ, సిబ్బంది పాల్గొని 222మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు.

నమో నమో యువ సమ్మేళనం



సత్తుపల్లి, జనవరి25: భారతీయ జనతా యువమోర్చా జిల్లా కార్యదర్శి పాల నాగ సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో గురువారం సత్తుపల్లి కళాభారతిలో నమో నమో యువ సమ్మేళనం జరిగింది. కళాభారతిలో ఎల్ఈడీ ఏర్పాటుచేసి ప్రధాని మోదీ ప్రసంగాన్ని లైవ్‌లో వినిపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈవీ.రమేష్, సుదర్శన్ మిశ్రా, మండల బీజేపీ అధ్యక్షుడు పాలకొల్లు శ్రీనివాస్, మైనార్టీ మోర్చా మండల అధ్యక్షుడు ఎస్‌కే.సుభానీ పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్:ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగాన్ని వర్చువల్‌గా ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా బీజేపీ నాయకులు వీక్షించే ఏర్పాటు చేశారు. ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులతో కలిసి కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి వీక్షించారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి25: నగరంలోని డీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో గురువారం సైబర్ నేరాలు, జరుగుతున్న విధానం నివారణ మార్గాలపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నివారణ శాఖ డీఎస్పీ శంకర్, ప్రిన్సిపాల్ తేనే నాగేశ్వరరావు హాజరయ్యారు.బ్యాంక్ అకౌంట్‌లపై గోప్యంగా ఉండాలని హాకర్లుతో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని వారి నుంచి జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మూహన్‌రెడ్డి, చైర్‌పర్సన్ శోభారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని డిప్యూటీ సీఎంకి వినతి

బోనకల్, జనవరి 25: విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు గురువారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసి తమ సమస్యలనుపరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. పాదయాత్రలో ఇచ్చిన హామీల మేరకు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి షేక్ మహబూబ్ పాషా, జేఏసీ ప్రదాన కార్యదర్శి యాదగిరి, భట్టు చందర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పనుల సబ్‌డివిజన్ కమిటీ ఎన్నిక

వైరా, జనవరి 25: వైరా మిషన్ భగీరథ వర్క్స్ ఐఎన్‌టీయూసీ యూనియన్ సబ్‌డివిజన్ కమిటీని కార్మికులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా కందుల అర్జున్‌రావు, గొడ్డుగొర్ల రమేష్, కోశాధికారిగా అప్పం సుధాకర్‌రావు, ఉపాధ్యక్షుడిగా గుమ్మా నర్సింహారావు, సహాయ కార్యదర్శిగా కాశిమళ్ల నాగబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏదునూరి సురేష్, గౌరవ సలహాదారుడిగా పర్సా పిచ్చయ్య, కమిటీ మెంబర్లుగా సీహెచ్.లక్ష్మణాచారి, బి.అంద్రయ్యను ఎన్నుకున్నారు.

బస్టాండ్ తనిఖీ చేసిన ఆర్ఎం

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి25: నగరంలోని నూతన బస్టాండ్‌లోని పలు ప్రాంతాలను ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సీహెచ్ వెంకన్న గురువారం తనిఖీలు చేశారు. బస్టాండ్‌లోని ప్లాట్‌ఫామ్స్ కార్గో పాయింట్, మూత్రశాలలను తనిఖీ చేసి అన్నిప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఎండాకాలం నేపథ్యంలో బస్టాండ్‌లోని గార్డెన్, గ్రీనరీ పెరిగే విదంగా చూడాలని ఎస్ఎం శ్రీనివాస్‌కు ఆదేశించారు. మరుగుదోడ్లు, పార్కింగ్ శుభ్రంగా ఉండాలన్నారు.

ఉపయోగకరంగా సౌకర్యాలుకల్పించాలి

ఖమ్మంకలెక్టరేట్, జనవరి25: పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యే యువతకు సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పర్సన్ ఇన్‌చార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ , పర్సన్ ఇన్‌చార్జి బి సత్యప్రసాద్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన చాంబర్‌లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలపై సమీక్షించారు. కమిటీ సభ్యులు ఏడు అజెండాలపై చర్చించి తీర్మానం చేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ నిర్వహణకు అంచనాలు రూపొందించి సంచాలకులు పౌర గ్రంథాలయ శాఖకు పంపించినట్లు తెలిపారు.